మంగళవారం 18, ఫిబ్రవరి 2025
https://www.telugudesam.org

# చైతన్యరథం


సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం 3

రేణిగుంట ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు ఘన స్వాగతం 3

# సంస్కృతీ పరిరక్షణకు ఆలయమే ఆధారం





- దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు... అభివృద్ధికి సోపానాలు
- దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజానిది ప్రత్యేక పాత్ర
- దేవాలయాల్లో అన్నదానానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే
- ఆలయాల అభివృద్ధికి రూ.134 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ వెంకన్న ఆలయం ఉండాలి
- తిరుమల ఐటీసీఎక్స్ సదస్సులో సీఎం చంద్రబాబు ఉవాచ

2

## జీబీఎస్‌పై ఆందోళన వద్దు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో తగిన వైద్య సేవలు, ఔషధాలు
- అవసరం మేరకు ఇమ్యునోగ్లోబిన్ ఇంజక్షన్లు
- ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది
- వ్యాధి నియంత్రణకు తగు చర్యలు
- సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు
- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

7



## ప్రజాసంతృప్తే పథకాలకు గీటురాయి



- పాలసీలో తప్పులుంటే సరిదిద్దండి....
- అమలులో అలసత్వముంటే చర్యలు తీసుకోండి
- 'ప్రజలే ఫస్ట్'.. ప్రభుత్వ వ్యవస్థల విధానం కావాలి
- పథకాల అమలుపై జిల్లాలవారీగానూ రేటింగ్
- ఐవీఆర్ఎస్ అనేది నిరంతరం సాగే ప్రక్రియ
- వారానికి నాలుగు శాఖల పనితీరును సమీక్షిస్తా
- 'పర్సెప్షన్ ట్రాకింగ్'లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

3



మహా కుంభమేళాలో మంత్రి లోకేష్ దంపతుల పుణ్యస్నానాలు 5

## జగన్ రెడ్డి అప్పులతో అంతులేని ఆర్థిక విధ్వంసం

- మంత్రి నారా లోకేష్ మండిపాటు
- 58 ఏళ్లపాటు అందరు సీఎంలు చేసిన అప్పులపై ఏడాదికి వడ్డీ 2019 నాటికి రూ.14,155 కోట్లు
- 2024 నాటికి ఏడాదికి రూ.24,944 కోట్లకు చేరిన వడ్డీ
- ఐదేళ్లలో జగన్ రెడ్డి చేసిన అప్పులపై వడ్డీ భారమే రూ. 11 వేల కోట్లు
- లెక్కలతో వివరించిన మంత్రి లోకేష్

5



కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో లోకేష్ దంపతుల పూజలు

- కాల భైరవ ఆలయ సందర్శన
- విశాలాక్షి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

6

## దళితులపై అరాచకాలు చేస్తే పరామర్శా?



- ముద్దాయిలపై అంత ప్రేమెందుకు?
- దళితజాతి మిమ్మల్ని చూసి ఛీకొడుతోంది
- వంశీ పరామర్శకు జగన్ వెళ్లడం సిగ్గుచేటు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల

7

## 5 సంస్థలు...రూ.2 వేల కోట్ల పెట్టుబడులు



- చేనేత రంగంలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి
- 15 వేల మందికి ఉద్యోగావకాశాలు
- త్వరలోనే ఆయా సంస్థలతో ఒప్పందాలు
- చంద్రబాబు బ్రాండ్‌తో ఏపీకి పెట్టుబడుదారుల క్యూ
- త్వరలో ఆంధ్రలోనూ పెట్టుబడిదారుల సదస్సు
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత వెల్లడి

8

## కోటప్పకొండలో మహాశివరాత్రికి.. పకడ్బందీగా ఏర్పాట్లు


- భక్తులకు సౌకర్యవంతంగా దేవదేవుడి దర్శనం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

9

చైతన్యరథం

# సంస్కృతీ పరిరక్షణకు ఆలయమే ఆధారం

- దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు... అభివృద్ధికి సోపానాలు
- దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజానిది ప్రత్యేక పాత్ర
- దేవాలయాల్లో అన్నదానానికి శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే
- ఆలయాల అభివృద్ధికి రూ.134 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ వెంకన్న ఆలయం ఉండాలి
- తిరుమల ఐటీసీఎక్స్ సదస్సులో సీఎం చంద్రబాబు ఉవాచ



తిరుపతి (చైతన్య రథం): మన సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడంలో దేవాలయాల పాత్ర చాలా ప్రధానమైనదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాకుండా... అభివృద్ధికి ఆదాయ వనరులుగా ఉంటున్నాయన్నారు. తిరుపతిలో అంతర్జాతీయ ఆలయాల సదస్సులో సోమవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దేవాలయ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడం, వాటికి సాధికారత కల్పించడం, ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మెరుగుపరిచే విషయంలో ఐటీసీఎక్స్ సేవలు అందిస్తోందన్నారు. 17 దేశాలనుంచి 1,581 దేవాలయాలను ఏకంచేస్తూ ఇటువంటి మంచి కార్యక్రమానికి ఐటీసీఎక్స్ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. దేవాలయాల్లో మొదటిసారి ఎన్టీఆర్ అన్నదానాన్ని 1983-84లో ప్రారంభించారు. రూ.2 వేల కోట్లతో ప్రస్తుతం కార్పస్ ఉంది. రూ.440 కోట్ల కార్పస్‌తో 2003లో ప్రాణదానం పథకాన్ని ప్రారంభించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

### ఆలయాల ఆర్థిక వ్యవస్థ రూ.6 లక్షల కోట్లు

'సుసంపన్నమైన భవిష్యత్ నిర్మాణానికి దేవాలయ వారసత్వాన్ని, ఆధ్యాత్మికతను, సాంకేతిక బలాన్ని వినియోగించుకోవాలని దేశాన్ని కోరుతున్నా. ఆధ్యాత్మిక సంపద రక్షణలో ఏఐ ఇంటిగ్రేషన్, ఫిన్‌టెక్ సొల్యూషన్స్, విరాళాల వినియోగం, సుస్థిరత, భద్రత, రద్దీ నియంత్రణ, ఆర్థిక పారదర్శకతను ఐటీసీఎక్స్ చెబుతోందని, ఆలయాల నిధుల నిర్వహణ, చట్టపరమైన సవాళ్లకు ఐసీటీఎక్స్ పరిష్కార మార్గాలను చూపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీ సంకల్పించిన వికసిత్ భారత్-2047కు అనుగుణంగా ఐసీటీఎక్స్ దేవాలయాల నిర్వహణ, ఆర్థికాభివృద్ధికి సహకరిస్తూ ప్రపంచంలో దేవాలయాలకు సహకారాన్ని అందిస్తోందన్నారు. భారతదేశంలోని అన్ని ఆలయాల ఆర్థిక వ్యవస్థ విలువ రూ.5 లక్షల కోట్ల నుంచి రూ.6 లక్షల కోట్ల వరకు ఉంటుందన్నారు. ఇంతటి విలువైన సంపదను కాపాడుకోవాలంటే ఆలయాల నిర్వహణలో పారదర్శకత అవసరమని ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు.

### ఆలయ బోర్డుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు అవకాశం

ఆలయ సాంప్రదాయాల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు ఉన్న అనుబంధాన్ని గుర్తించి ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లో వారికి అవకాశాలు కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 'భక్తులు ఆలయాలను సంతోషంగా సందర్శించేందుకు సౌకర్యాలు కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడటం ప్రభుత్వ విధానంగా పెట్టుకున్నాం. అర్చకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గౌరవ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాం. వేద విద్యను అభ్యసించిన వారికి నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు చెల్లిస్తున్నాం. మా ప్రభుత్వం ఏర్పడిన 7 నెలల్లోనే దేవాలయాల అభివృద్ధికి రూ.134 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాం. పరిమిత ఆదాయం ఉన్న చిన్న దేవాల యాల మనుగడకు దూప దీప నైవేద్యానికి అందించే సాయాన్ని రూ.10 వేలకు పెంచామని చంద్రబాబు అన్నారు.

### దేవతల రాజధాని నిర్మిస్తున్నాం

దేవేంద్రుడి రాజధాని స్ఫూర్తితో దేవతల నివాసంగా అమరావతి రాజధాని నిర్మిస్తున్నాం. తిరుమలలో 75శాతం పచ్చదనం ఉంచేలా చర్యలు తీసుకుంటాం. దేవునికి సేవ చేయడమంటే మానవాళికి సేవ చేయడమే. ఆలయ నిర్వహణలో అవినీతికి తావులేకుండా చేస్తాం. వెంకటేశ్వరస్వామి దగ్గర మోసం చేస్తే ఆయన క్షమించరు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

### ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తీసుకుంటున్నాం

'రాష్ట్రంలో టెంపుల్ టూరిజానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. 2024లో ఏపీ 21కోట్లమంది ఆలయాలను సందర్శించారు. తిరుమల, శ్రీశైలంవంటి ఎన్నో పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఏపీ ఉంది. జ్యోతిర్లింగాలు, శక్తిపీఠాలు, పంచారామాలు కొలువై ఉన్నాయి. రాష్ట్ర సంస్కృతిని చాటేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తోంది. వేద, ఆగమ సంప్రదాయాల విషయాలలో స్వేచ్ఛనిచ్చాం. దేవాదాయ శాఖలో సంస్కరణలు ప్రవేశపెట్టాం. యాత్రికులు, భక్తులనుంచి అభిప్రాయాలను సేకరించేందుకు ఎక్కడా లేని విధంగా ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తీసుకుంటున్నాం. దేవాలయాల సందర్శనకు వచ్చే వారికి పూర్తి స్థాయిలో సంతృప్తిని కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటా'మని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.









# ప్రజాసంతృప్తే పథకాలకు గీటురాయి

- పాలసీలో తప్పులుంటే సరిదిద్దండి....
- అమలులో అలసత్వముంటే చర్యలు తీసుకోండి
- 'ప్రజలే ఫస్ట్'.. ప్రభుత్వ వ్యవస్థల విధానం కావాలి
- పథకాల అమలుపై జిల్లాలవారీగానూ రేటింగ్
- ఐవీఆర్ఎస్ అనేది నిరంతరం సాగే ప్రక్రియ
- వారానికి నాలుగు శాఖల పనితీరును సమీక్షిస్తా
- 'పర్సెప్షన్ ట్రాకింగ్'లో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన



అమరావతి (చైతన్య రథం): ప్రజలే ఫస్ట్ అనే విధానంతో ప్రభుత్వం పనిచేస్తుందని.... దీనికి అనుగుణంగా అన్ని శాఖల్లో, అన్ని స్థాయిల్లో అధికారులు, ప్రభుత్వోద్యోగుల పనితీరు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమం అమల్లో ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవ్వాలని అన్నారు. ఏదైనా పాలసీలోనో, అమలులోనో లోపాలు, తప్పులుంటే సరిదిద్దాలని... అయితే వాటి అమలులో అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతివుంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనితీరు బాగుంటేనే అన్ని కార్యక్రమాల్లో ప్రజలనుంచి సానుకూల స్పందన వస్తుందని... అప్పుడే ప్రభుత్వానికీ మంచిపేరు దక్కుతుందని సీఎం చంద్రబాబు సూచించారు.

## మెక్కుబడి పనితీరుతో మార్పు రాదు

అనేక కష్టాలు, సవాళ్లను అధిగమించి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామని... వీటి ఫలితాలు రావాలంటే వాటి అమలు అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. మొక్కుబడి పనితీరుతో మార్పు రాదని... గత ప్రభుత్వానికి తమ ప్రభుత్వానికి పాలనలో స్పష్టమైన వ్యత్యాసం కనిపించేలా... మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమయ్యేలా అన్ని వ్యవస్థలూ పనిచేయాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని.... సాధ్యమైనంత ఎక్కువ టెక్నాలజీ వాడాలని సీఎం సూచించారు. శాఖల పనితీరుపై నిరంతరంగా సర్వేల ద్వారా నివేదికలు తెప్పిస్తామన్నారు. ప్రజలిచ్చే రేటింగ్‌పై వారానికి నాలుగు విభాగాలపై సమీక్ష చేస్తున్న సీఎం.... ఈ రోజు దీపం పథకం, రేషన్ బియ్యం పంపిణీ, ఆర్టీసి సర్వీసులు, చెత్తనుంచి కంపోస్ట్ తయారీ వంటి కార్యక్రమాల ప్రజా స్పందనపై సమీక్ష నిర్వహించారు. ఈ విభాగాల్లో లబ్ధిదారులు, ప్రజలనుంచి ఐవీఆర్ఎస్ ద్వారా, క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా రివ్యూ చేశారు. ప్రతి ప్రభుత్వ శాఖలో పనితీరుపై పర్సెప్షన్ ట్రాకింగ్ చేస్తున్నామని... ప్రజలనుంచి నేరుగా వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను ప్రాతిపదికగా తీసుకుని పనితీరు మెరుగుపరుచుకోవాలని సీఎం అన్నారు.

## దీపం పథకం

దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీ విషయంలో లబ్ధిదారుల నుంచి అక్కడక్కడా ఫిర్యాదులు రావడంపై సీఎం అధికారులను వివరణ కోరారు. ప్రభుత్వం ఉచితంగా సిలిండర్లు ఇస్తుంటే... వాటిని డెలివరీ చేసే సమయంలో డబ్బులు అడుగుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై యాక్షన్ తీసుకోవాలని సీఎం సూచించారు. సిలిండర్ల డెలివరీలో ఫిర్యాదులు వస్తే... ఆ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎక్కువ ఫిర్యాదులు వస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో డబ్బు అకౌంట్‌లో జమ అయ్యిందా? లేదా? అనే విషయంలో ప్రజలనుంచి సమాచారం సేకరించగా... 48 గంటల్లో డబ్బు జమవ్వడం లేదని కొంతమంది ఫిర్యాదు చేశారు. దీనికి కారణాలు విశ్లేషించి... సాంకేతికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

## ఆర్టీసీ సర్వీసులు

ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి సదరు బస్సు సమయానికి బయలుదేరిందా... నిర్దేసించిన సమయానికి గమ్యానికి తీసుకువెళ్లారా.. బస్‌స్టాండ్‌లో సదుపాయాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలపై ప్రయాణికుల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్‌పై చర్చించారు. ఆర్టీసీ బస్సుల సేవలపై ప్రయాణికుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడానికి ప్రతి బస్సులో క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచాలని సీఎం తెలిపారు. బస్ స్టాండ్‌లలో మౌలిక సదుపాయాలపై (తాగునీరు, టాయిలెట్లు, కుర్చీలు) ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారని నివేదిక చెప్పగా... దాన్ని సరిదిద్దాలని సీఎం సూచించారు. ఇప్పటికి 1100 బస్సుల్లో క్యూఆర్ కోడ్ పెట్టామని అధికారులు చెప్పగా.... మొత్తం 11 వేల బస్సులతోపాటు బస్‌స్టాప్‌లు, బస్‌స్టేషన్‌లలోనూ విరివిగా క్యూర్‌ఆర్ కోడ్ ఉంచి... ప్రజలనుంచి నేరుగా అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. అలాగే బస్‌స్టాండ్‌లలో ఉండే క్యాంటీన్‌లలో ఆహారం, ధరలువంటి వాటిపైనా ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని... తద్వారా నాణ్యమైన సేవలు అందేలా చూడవచ్చని సీఎం అన్నారు.

## చెత్తనుంచి కంపోస్ట్ తయారీ

పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్తనుంచి కంపోస్ట్ తయారీ కేంద్రాల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. మీ గ్రామంలో కంపోస్ట్ తయారీ కేంద్రం ఉందా? పని చేస్తుందా? అది ఉపయోగపడుతుందా? లేదా? అనే ప్రశ్నలతో ఆయా గ్రామస్తులనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. 5,859 గ్రామాలనుంచి ఈమేరకు సమాచారం తీసుకున్నారు. ఈ కేంద్రాలు మరింత ఎఫెక్టివ్‌గా పని చేయాలని ప్రజలు కోరుకుంటున్నట్టు సర్వే ద్వారా వెల్లడైంది. 2014-19 మధ్య కాలంలో చెత్తనుంచి కంపోస్ట్ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశామని... ఈ కార్యక్రమాన్ని గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని... మళ్లీ అన్ని కేంద్రాలను వినియోగంలో తేవాలని సీఎం సూచించారు. దీనితోపాటు రేషన్ సరుకుల పంపిణీపైనా ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సమీక్ష చేశారు. రేషన్ సరుకుల పంపిణీలో తీసుకోవాల్సిన దానికంటే ఎక్కువ ధర తీసుకుంటున్నారని అక్కడక్కడా లబ్ధిదారులనుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులను సీఎం ప్రశ్నించారు. రేషన్ వ్యవహారంలో అవినీతి ఉండకూడదని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం ఇంటింటికీ సరఫరాపై వస్తున్న ఫిర్యాదులపైనా లోతుగా విచారణ జరిపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## కేవలం చర్చలే కాదు... చర్యలు ఉండాలి

ప్రతివారం ఓ నాలుగు శాఖల్లో పథకాలు, కార్యక్రమాల అమలుపై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని దానిపై సమీక్ష చేస్తానని సీఎం అధికారులకు వెల్లడించారు. ప్రతిశాఖ గాడిన పడాలని.... సేవల్లో మార్పు కనిపించాలని సీఎం అన్నారు. ప్రజలనుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌పై కేవలం చర్చించడమే కాదని... పొరపాట్లు, తప్పులు జరిగినచోట సరిదిద్దాలని, అవినీతికి, నిర్లక్ష్యానికి పాల్పడినచోట చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైందని, గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి వ్యవస్థలో, విభాగంలో మార్పు కనిపించాలని సీఎం స్పష్టం చేశారు. ఆయా పథకాలు, కార్యక్రమాల అమలు విషయంలో జిల్లాలవారీగా కూడా ర్యాంకులు ఇస్తామని... వెనకబడివున్న జిల్లాల కలెక్టర్లు దీనికి అనుగుణంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

### శ్రీశైలం మల్లన్న బ్రహ్మోత్సవాలకు

# సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



అమరావతి (చైతన్య రథం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు, పండితులు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానించారు. శ్రీశైలం మహాక్షేత్రంలో 19నుంచి మార్చి 1వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని సీఎంకు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ పండితులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.

# రేణిగుంట ఎయిర్‌పోర్టులో చంద్రబాబుకు ఘన స్వాగతం

రేణిగుంట (చైతన్య రథం): దేవాలయాల అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు తిరుపతికి వెళ్తున్న సీఎం చంద్రబాబు.. సోమవారం మధ్యాహ్నం 3.53 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో దిగారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పెద్దఎత్తున ఆహ్వానం లభించింది. రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, డీఐజీ షిమోషిబాజ్పాయ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జెసీ శుభం బన్సల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, వెంకటగిరి, నగరి, పూతలపట్టు, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట మునిప్రసాద్ (నాని), బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలం, కురుగొండ్ల రామకృష్ణ, భానుప్రకాష్, మురళీమోహన్, వి.యం థామస్, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నేతలు, అధికారులు సీఎంకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు. అనంతరం టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి ఆశ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ దేవాలయాల సదస్సుకు సీఎం చంద్రబాబు రోడ్డుమార్గాన బయలుదేరారు.





చైతన్యరథం

# ఘనంగా ప్రారంభమైన టెంపుల్ ఎక్స్‌పో








తిరుపతి (చైతన్య రథం): ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో కార్యక్రమం ఘనంగా మొదలైంది. కార్యక్రమానికి మూడు రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు. నేటినుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ పాల్గొన్నారు. ఈ ఎక్స్‌పోలో భాగంగా నిపుణుల మధ్య ఆలయాలపై చర్చలు, వర్క్‌షాప్‌లు జరగనున్నాయి. టెంపుల్ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో అంత్యోదయ ప్రతిష్ఠాన్ సహకారంతో తిరుపతిలోని ఆశ కన్వెన్షన్ సెంటర్లోలో అంతర్జాతీయ దేవాలయాల సమావేశ ఎక్స్‌పో కొనసాగనుంది. మూడు రాష్ట్రాల సీఎంలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్, తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, గోవా ఆరోగ్య, అటవీ మంత్రి విశ్వజిత్ రాణే, మహారాష్ట్ర సాంకేతిక, సాంస్కృతిక మంత్రి ఆశిష్ షెలార్, గోవా టూరిజం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి రోహన్ ఖౌంటే, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుతోపాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కన్వెన్షన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హార్దిక అభినందనలు తెలుపుతూ రాసిన లేఖను నిర్వాహకులు చదివి వినిపించారు. దేవాలయాల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను తెలియజేసే ఈ ప్రత్యేక జ్ఞాన పంచన కార్యక్రమంలో నిపుణుల నేతృత్వంలో చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, మాస్టర్ క్లాసులు- టెంపుల్ టాక్స్ జరుగనున్నాయి.

58 దేశాల నుంచి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన మతాల భక్తి సంస్థల ప్రతినిధులు పలువురు పాల్గొంటారు. ఐటీసీఎక్స్ ద్వారా 58 దేశాల్లో 1,581 దేవాలయాలను ఒకే వేదికపై అనుసంధానించడాన్ని ఈ కార్యక్రమం ద్వారా చేపట్టనున్నారు. ఈ కన్వెన్షన్లో పునరుత్పాదక ఇంధనం, దేవాలయ పాలన, దేవాలయ ఆర్థిక వ్యవస్థ, స్మార్ట్ టెంపుల్ పరిష్కారాలు వంటి అంశాలపై సెమినార్లు నిర్వహిస్తారు.













## మహా కుంభమేళాలో

# మంత్రి లోకేష్ దంపతుల పుణ్యస్నానాలు









ప్రయాగరాజ్ (యుపి): ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో సోమవారం రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దంపతులు పుణ్యస్నానాలు చేశారు. త్రివేణి సంగమం షాహి స్నానఘట్టంలో సాంప్రదాయబద్ధంగా స్నానాన్ని ఆచరించి గంగాదేవికి పూజలు చేసి, హారతులు ఇచ్చారు. పితృదేవతలను స్మరించుకుంటూ బ్రాహ్మణులకు వస్త్రదానం చేశారు. పూర్వీకులకు మోక్షమార్గాన్ని ప్రసాదించాలంటూ గంగాదేవిని ప్రార్థించారు. కుంభమేళా ప్రాంగణంలో ప్రతిధ్వనించే కీర్తనలు, నదీ సంగమం వద్ద పవిత్ర పూజల మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో లోకేష్ దంపతులు మమేకమయ్యారు. మహా కుంభమేళా ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు.. ఇది భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వం. నమ్మకం, ఆచారాలు, ఆధ్యాత్మిక జ్ఞానంతో ముడిపడి ఉన్న శక్తిమంతమైన వేడుక. మానవత్వం, ఆధ్యాత్మికత మధ్య సంబంధాన్ని, లోతుగా నాటుకుపోయిన భారతజాతి విలువలను ప్రతిబింబిస్తుంది. పవిత్ర నదుల్లో ఆచరించే స్నానం, దానం, హృదయ పూర్వకమైన భక్తి మోక్ష మార్గాన్ని చూపిస్తాయని కోట్లాదిమంది నమ్మకం. కుంభమేళాలో స్నానాలు, పూజాధికాల అనంతరం లోకేష్ దంపతులు కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని సందర్శించేందుకు వారణాసి బయలుదేరి వెళ్లారు.



- మంత్రి నారా లోకేష్ మండిపాటు
- 58 ఏళ్లపాటు అందరు సీఎంలు చేసిన అప్పులపై ఏడాదికి వడ్డీ 2019 నాటికి రూ.14,155 కోట్లు
- 2024 నాటికి ఏడాదికి రూ.24,944 కోట్లకు చేరిన వడ్డీ
- ఐదేళ్లలో జగన్‌రెడ్డి చేసిన అప్పులపై వడ్డీ భారమే రూ. 11 వేల కోట్లు
- లెక్కలతో వివరించిన మంత్రి లోకేష్

## జగన్‌రెడ్డి అప్పులతో

# అంతులేని ఆర్థిక విధ్వంసం

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సృష్టించిన ఆర్థిక విధ్వంసం అంతా ఇంతా కాదని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఇష్టమొచ్చినట్లు అప్పులు చేసి ఏపీ ప్రభుత్వంపై పెను భారం మోపారని ఆగ్రహించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఇందులో సీఎంగా జగన్ చేసిన అప్పులకు కడుతున్న వడ్డీలకు సంబంధించిన పత్రాలను జోడించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి గత ముఖ్యమంత్రులు చేసిన అప్పులకు కట్టే వడ్డీ కంటే ఐదేళ్లలో జగన్ చేసిన అప్పులకు కట్టే వడ్డీలు ఎక్కువని మంత్రి లోకేష్ తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి అందినకాడికి అప్పులు చేశారు. 58 ఏళ్లపాటు ఏపీ ముఖ్యమంత్రులుగా ఉన్న అందరూ కలిపి చేసిన అప్పులపై 2019 నాటికి రూ.14,155 కోట్లు వడ్డీగా చెల్లిస్తున్నట్లు లోకేష్ వెల్లడించారు. అయితే జగన్ రెడ్డి పాలించిన ఐదేళ్ల కాలానికి అంటే 2024 నాటికి అప్పులపై కట్టాల్సిన వడ్డీ రూ.24,944 కోట్లకు చేరిందని మంత్రి తెలిపారు. దాదాపు ఏపీకి చెందిన ముఖ్యమంత్రులు అందరూ చేసిన అప్పులపై కట్టిన వడ్డీ కంటే జగన్ రెడ్డి చేసిన అప్పులపై కట్టే వడ్డీనే సుమారు రూ.11 వేల కోట్లు అధికమని వెల్లడించారు.

అందినకాడికి అప్పులు చేసి జగన్ రెడ్డి ఎంతటి ఆర్థిక విధ్వంసం సృష్టించారో ఈ గణాంకాలే నిదర్శనమని మంత్రి లోకేష్ మండిపడ్డారు.



# కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో లోకేష్ దంపతుల పూజలు


## కాల భైరవ ఆలయ సందర్శన - విశాలాక్షి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ







వారణాసి (యుపి): పవిత్ర గంగానది ఒడ్డున కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం సతీసమేతంగా సందర్శించారు. జ్యోతిర్లింగాల్లో ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో లోకేష్ దంపతులు భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశ్వనాధుని ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించి, లోకేష్ దంపతులకు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు. అంతకుముందుకు వారణాసిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన కాలభైరవ స్వామి ఆలయాన్ని నారా లోకేష్, బ్రహ్మణి దంపతులు సందర్శించారు. విశ్వేశ్వరుని ఆలయ సందర్శన అనంతరం అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన కాశీ విశాలాక్షి ఆలయాన్ని లోకేష్ దంపతులు సందర్శించి పూజలు చేశారు. ఆది పరాశక్తి అవతారాల్లో 4వ అవతారంగా విశాలాక్షి దేవి కాశీలో అవతరించింది. ఈ సందర్భంగా విశాలాక్షి అమ్మవారికి లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.







# ముగ్గురు మహిళా కూలీల మృతి కలచివేసింది

- నారాకోడూరు రోడ్డు ప్రమాదంపై మంత్రి లోకేష్ విచారం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



అమరావతి (చైతన్యరథం): గుంటూరు జిల్లా నారాకోడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళా వ్యవసాయ కూలీలు దుర్మరణం పాలవ్వడం తనను కలచివేసిందని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

### దిగ్భ్రాంతికి గురి చేసింది: మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీల మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుడంపాడు సమీపంలో ఆటో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యవసాయ కూలీలు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

### బాధాకరం: మంత్రి మండిపల్లి

గుంటూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం బాధాకరమని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. కూలీలతో వెళు న్న ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు ఘటనలో క్షతగాత్రులకు గుంటూరు జీజీహెచ్ లో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

### మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

గుంటూరు జిల్లా నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు దుర్మరణం చెందిన ఘటన కలచి వేసిందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ప్రమాద వార్త తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మంత్రి దుర్గేష్ ఫోన్లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. జీజీహెచ్‌లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# జీబీఎస్‌పై ఆందోళన వద్దు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో తగిన వైద్య సేవలు, ఔషదాలు
- అవసరం మేరకు ఇమ్యునోగ్లోబిన్ ఇంజక్షన్లు
- ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది
- వ్యాధి నియంత్రణకు తగు చర్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి (చైతన్యరథం): గులియన్ బారీ సిండ్రోమ్ (జి.బి.ఎస్.) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల (జి.జి.హెచ్.)ల్లో తగిన వైద్యసేవలు, ఔషదాలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, వైద్య విద్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జీబీఎస్‌పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ వ్యాధి ప్రబలడానికి గల ప్రధాన కారణాలను నిశితంగా పరిశీలిస్తోందన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి గతంలో నమోదు అయిన జీబీఎస్ కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, ఈ వ్యాధి సోకడానికి, విస్తరించడానికి గల కారణాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పొరపాటున పెరిఫెరల్ నరాలపై దాడి చేయడంతో కండరాల బలహీనత, తిమ్మిర్లు రావడం, కాళ్లు చచ్చుబడిపోవటం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎటువంటి చికిత్స అవసరం లేకుండానే 85 శాతం వరకూ ఈ వ్యాధి తగ్గిపోయే అవకాశం ఉందని, మిగిలిన 15 శాతం మందికి మాత్రమే ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇటు వంటి అనారోగ్య సమస్యలు ఏ మాత్రం బయపడినా, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి తగు వైద్య సేవలు పొందాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో గత ఏడాది పది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 301 కేసులు నమోదుకాగా, వీటిలో అధిక మొత్తంలో 115 కేసులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదవ్వడానికి కారణం ఆ ఆసుపత్రిలో న్యూరాలజీకి సంబందించిన అన్ని రకాల వైద్య సేవలు, ఔషదాలు అందుబాటులో ఉండటమేనన్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరిలో 43 కేసులు నమోదు కాగా వారిలో 17 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జీబీఎస్ వ్యాధి బారిన పడిన వారికి తగిన వైద్య సేవలు అందజేసేందుకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక పేషంట్‌కి రోజుకి ఐదు ఇంజక్షన్ల చొప్పున ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని, బహిరంగ మార్కెట్‌లో ఈ ఇంజక్షను ఖరీదు దాదాపు రూ.20 వేల వరకూ ఉందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో దీన్ని ఉచితంగా ఇస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్నాం. అనంతపురం, గుంటూరు, కడప, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖ జీజీహెచ్‌ల్లో 749 ఇంజెక్షన్లు ఉన్నాయి. అదనంగా మరో 469 ఇంజెక్షన్లు ఉన్నాయి. వీటిలో 425 ఇంజెక్షన్లను లభ్యత లేని ఇతర జీజీహెచ్‌లకు తరలిస్తున్నాం. ఖర్చుకు వెనుకాడకుండా ప్రజల అరోగ్య సంరక్షణే ధ్యేయంగా అవసరం మేరకు అదనంగా ఈ ఇంజెక్షన్లను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్.టి.ఆర్.వైద్య సేవ పథకం కింద కూడా ఈ వ్యాధి కవర్ అవుతున్నదన్నారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ పూనే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 181 మందిలో ఈ జీబీఎస్ వ్యాది లక్షణాలను గుర్తించడంతో ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఈ వ్యాధి వ్యాప్తికిగల కారణాలను ఐసీఎమ్ఆర్ బృందం పరిశీస్తోందని, జీవ కాలుష్యం ఈ వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణం కావచ్చనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ జీబీఎస్ వ్యాధి కాళ్లలో ప్రారంభమై పైవరకు వ్యాపిస్తోందని, తిమ్మిర్లు, నడవలేని స్థితి సంభవిస్తుందన్నారు. ఇటువంటి లక్షణాలు బయపడిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి తగిన వైద్యసేవలు పొందితే ఎటు వంటి ప్రమాదం ఉండదన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు వ్యాధి తగ్గిపోతోందని, జీబీఎస్ రోగులకు సరిపడా ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మరింత కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,200 ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, మరో 6,000 ఇంజెక్షన్లను సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ 1834 లోనే ఈ వ్యాధిని గుర్తించారని, ఇది చాలా పురాతనమైన వ్యాధే అని, పలు రకాల ఇన్ఫెక్షన్ల వల్ల ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. సాధారణ జలుబుగా ఈ వ్యాధి ప్రారంభమై అజాగ్రత్తగా ఉంటే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఈ వ్యాధి లక్షణాలు ఏమాత్రం బయపడినా సరే వెంటనే వైద్యులను సంప్రదించి తగు వైద్య సేవలు పొందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డా.నరసింహం కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# దళితులపై అరాచకాలు చేస్తే పరామర్శా?

- ముద్దాయిలపై అంత ప్రేమెందుకు?
- దళితజాతి మిమ్మల్ని చూసి ఛీకొడుతోంది
- వంశీ పరామర్శకు వెళ్లడం సిగ్గుచేటు
- చంచల్‌గూడ అనుబంధం కాబోలు..
- మా జగన్..మా జగన్ అంటున్నారు
- జైల్లో ఏమైనా వకాల్తా తీసుకున్నారా?
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య



మంగళగిరి(చైతన్యరథం): అనేక కేసుల్లో ముద్దాయి, అసాంఘిక శక్తిగా పేరు గాం చి దళితులను ఊచకోత కోసి మహిళల వ్యక్తిత్వ హననం చేసిన వల్లభనేని వంశీని జైల్లో పరామర్శించేందుకు జగన్ వెళ్లడం విడ్డూరమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలన అరాచక, అప్రజాస్వామిక, దౌర్జన్యపూరిత, రాక్షస పాలన. ముద్దాయి వల్లభనేని వంశీని పరామర్శించడానికి జగన్ పడుతున్న తపన, చూపిస్తున్న ప్రేమ వెనుక మతలబేంటో? అర్థం కావడంలేదు. వంశీ అన్నెం పున్నెం ఎరగడు.. నిజాయితీపరుడు సచ్ఛీలుడు..చీమ కు కూడా హాని తలపెట్టడు.. పరస్త్రీలను, దళితులను గౌరవిస్తాడు.. భూ కబ్జాలు చేయ డు..దొంగ పట్టాలు సృష్టించడు..పట్టిసీమ మట్టి కొట్టేయడు.. దళితులను హింసించడు.. అత్యంత నిజాయితీపరుడు అనే భావన జగన్‌లో ఉన్నట్లుంది. పట్టిసీమ గట్టు మట్టిని కొల్లగొట్టిన వంశీని పరామర్శించేందుకు వెళ్లడానికి ఎవరైనా ఆలోచించాలి. జగన్ పట్ల దళితులు ఆగ్రహావేశాలతో ఉన్నారనే విషయం జగన్ మరచిపోరాదు. పులివెందులకు చెందిన నాగమ్మ అనే దళితురాలు అత్యాచారానికి గురైతే పరామర్శకు వెళ్లని జగన్.. దుర్మార్గుడు, నికృష్టుడు వంశీని పరామర్శించడానికి వెళ్లడం ఆశ్చర్యంగా ఉంది. బాధితు రాలిని పరామర్శించేందుకు వెళ్లిన ప్రస్తుత హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు లపై ఎస్సీ, ఎస్టీ యాక్టు పెట్టించింది జగన్ కాదా? దళిత రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ విజ యపాల్.. జగన్ కోసం అరెస్టు అయితే ఆయనను పలకరించడానికి వెళ్లలేదెందుకు? బోరుగడ్డ అనిల్ అనే దళితుడిని పంమర్శించడానికి వెళ్లకపోవడానికి కారణం అతను దళితుడనా?

## ముద్దాయిలన్నా.. జైలన్నా ఎందుకంత ప్రేమ?

సొంత తల్లిని ఏడించిన వాడివి, చెల్లిని తరిమికొట్టిన వాడివి, బాబాయి కూతుర్ని మండుటెండలో పరార్ చేసిన వ్యక్తి జగన్. ఎన్నడూ వారి గురించి ఆలోచించని జగన్ ఇప్పుడు తగుదునమ్మా అని వంశీని పరామర్శించడం రాష్ట్ర మహిళలను కించపరచ డమే. మహిళలను మానసిక క్షోభ పెట్టిన వంశీని పరామర్శించడానికి జగన్ వెళ్లడం సిగ్గుచేటు. మహిళల పట్ల గౌరవం, ప్రేమ ఉండవు కానీ.. భూకబ్జాదారులు, దుర్మార్గు లు, అరాచక, అసాంఘిక శక్తులపై గౌరవం, ప్రేమ జగన్‌కు జాస్తి. ఏ తప్పు చేయని వాడిని పరామర్శించడంలో తప్పులేదు కానీ.. తప్పుల మీద తప్పులు చేసిన వాడిని పరా మర్శించడం పెద్ద తప్పు. నవ్విపోదురుగాక నాకేంటి అన్నట్లుగా తాను పరామర్శలకు వెళ్తాను, నన్నెవరు ఆపడానికంటే అది జగన్ ఇష్టం. ముద్దాయిలన్నా.. జైలన్నా జగన్‌కు ఎందుకంత ప్రేమ? నెల్లూరు జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, విజయ పాల్, బోరుగడ్డ అనిల్ లాంటి వారిని జగన్ ఎందుకు పరామర్శించలేదు? అని ప్రశ్నించారు.

## అసాంఘిక శక్తికి పరామర్శలేంటి?

జగన్ రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించడం దురదృష్టకరం. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఒక కరుడు కట్టిన అసాంఘిక శక్తి, భూ కబ్జాదారుడు, దళితవర్గాల మీద దాడి చేసే వ్యక్తి. మహిళలు అంటే అతనికి ఏ మాత్రం గౌరవం లేదు. అతనిపై అనేక కేసులున్నా యి. అలాంటి వ్యక్తిని జగన్ పరామర్శించడమేంటి? ఒక ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిని కిడ్నాప్ చేసి హింసించి అంతకుముందు పోలీసులకు ఇచ్చిన సాక్ష్యాన్ని వక్రీకరించి కోర్టు లో సాక్ష్యం ఇచ్చేటట్లుగా చేసిన తప్పుడు వ్యక్తి వల్లభనేని వంశీ. దళితుడిని బలవంతం చేసిన దౌర్భాగ్యుడిని, దుర్మార్గుడిని పోలీసులు అరెస్టు చేస్తే.. జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంటే.. జగన్ పరామర్శకు వెళ్లడంలో అర్థం లేదని మండిపడ్డారు.

## దళితులు ఛీకొడుతున్నారు...

ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. మీ పాలనలో నీచ, నికృష్ట సంఘ వ్యతిరేకి అయిన వంశీమోహన్ గన్నవరం ఎమ్మెల్యేగా సాగించిన అసాంఘిక కార్యక్రమాలు, అకృత్యాలు, దౌర్జన్యాలు, దోపిడీలు అన్నీ ఇన్నీ కావు. వీటన్నింటికి కూడా పోలీసులు కేసులు రిజిస్టర్ చేసి అరెస్టు చేశారు. అతన్ని పరామర్శించడానికి జగన్ జైలుకెళ్లడమేంటి? నేను వస్తున్నాను నీకేం పర్వాలేదు అని అన్నట్లుగా ఉంది జగన్ వాలకం. ఏంటి దొంగలు దొంగలు సానుభూతి తెలియజేసుకుంటున్నారని ప్రజలు చెవు లు కొరుక్కుంటున్నారు. మేమంతా ఒకటేనయ్యా మీకు అర్థం కాదు అని జగన్‌మో హన్‌రెడ్డి అన్నట్లుగా ఉంది. ముద్దాయిలు అంటే ఎందుకు జగన్‌కు అంత ప్రేమ, వల్ల మాలిన ప్రేమ చూపిస్తారు జగన్ ముద్దాయిలను బాగా అభిమానిస్తారు. జైల్లో ఉన్న చాలామంది ముద్దాయిలు కూడా “మా జగన్, మా జగన్” అంటారట ఎందుకో మరి? జైల్లో ఏమైనా వకాల్తా తీసుకున్నారా? 16 నెలలు చంచల్‌గూడ జైల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు వాళ్లతో పెరిగిన అనుబంధం కాబోలు.. వంశీ అన్యం పుణ్యం ఎరగడని, నిజాయితీపరుడని నిరూపించగలరా? దొంగ పట్టాలు పంచిన ఘనత వంశీది. పట్టిసీమ మట్టి కొట్టేయలేదని నిరూపించగలరా? వంశీ ఒక నీచుడని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల తర్వాత అతన్ని ఇప్పుడు అరెస్టు చేశారే.. ముందే చేయాల్సింది అని అందరూ అడుగుతున్నారు. ఎందుకు ఇంత ఆలస్యం అయిం దని ప్రశ్నిస్తున్నారు. దళితుడిని తీసుకెళ్లి కిడ్నాప్ చేసి కొడితే వాడిని పరామర్శించడానికి మీరు వెళతారా? ఏ పార్టీ దళితుల పట్ల ప్రేమ మీకు అతని మీద ప్రేమ దళితుడిని కొట్టి నందుకు అతన్ని అభినందించడానికి వెళుతున్నారా? జగన్ వ్యవహార శైలిని చూసి అన్ని వర్గాలు ఈసడించుకుంటున్నాయి..చీకొడుతున్నాయని ధ్వజమెత్తారు. ఇది ఎక్కడి న్యాయం జగన్‌మోహన్‌రెడ్డి? ముఖ్యమంత్రిత్వంలో సారా రేట్లు విపరీతంగా పెంచాడని ఒక బూతు మాట అంటే ఓం ప్రతాప్‌ని చంపేశారు. అతని ఫోన్ ఇప్పటికీ ఇవ్వలేదు. ఓం ప్రతాప్ ఇప్పటకీ కూడా వారి టెలిఫోన్ సెల్‌ఫోన్ ఎక్కడ ఉందో తెలియదు. జగన్ జాత కం ఎవరికీ తెలియనిదికాదు. మీ వ్యవహార శైలి మాకు తెలియదా? దళితులను మీరు ఏ మాత్రం ప్రేమిస్తారో మాకు తెలియదా? నాయకుడిగా ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసే వ్యక్తిగా ఇలా వెళ్లటం ఒక ముద్దాయిని పలకరించడానికి వెళ్లడం తన గౌరవాన్ని దిగజా ర్చుకోవడమేనని హితవుపలికారు.

# 5 సంస్థలు... రూ.2 వేల కోట్ల పెట్టుబడులు

- **చేనేత రంగంలో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి**
- **15 వేల మందికి ఉద్యోగావకాశాలు**
- **త్వరలోనే ఆయా సంస్థలతో ఒప్పందాలు**
- **మరిన్ని సంస్థలతో చర్చలు ఫలప్రదం**
- **చంద్రబాబు బ్రాండ్‌తో ఏపీకి పెట్టుబడుదారుల క్యూ**
- **త్వరలో ఆంధ్రలోనూ పెట్టుబడిదారుల సదస్సు**
- **రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత వెల్లడి**




న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగంలో పరిశ్రమల స్థాపనకు ఐదు సంస్థలు ముందుకొచ్చాయని, రూ.2 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ఆ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. త్వరలో ఆ సంస్థలతో ఎంవోయూలు చేసుకోబోతున్నామని, ఆయా కంపెనీల ఏర్పాటుతో 15 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయని తెలిపారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ భారత్ టెక్స్-2025 ఎగ్జిబిషన్‌లో మంత్రి సవిత రెండో రోజు సోమవారం కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న పలువురు దేశ, విదేశ పెట్టుబడుదారులతో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో పరిశ్రమల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు గురించి, చేనేత రంగంలో అవకాశాలు గురించి వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ అనువైన ప్రాంతమని వెల్లడించారు. చేనేత పరిశ్రమలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుం దని, నాణ్యమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటీవలే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చా మన్నారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధుల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సవిత చర్చలు జరిపారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో జరిగిన చర్చలు ఫలప్రదం కావడంతో, అడ్వాన్స్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్, ఐటీఎంఎఫ్, మాస్కో ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ సహా మరో రెండు సంస్థల ప్రతినిధులు రాష్ట్రంలో పెట్టుడులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు. రూ.2 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ఈ సంస్థలు ప్రతినిధులు ముందుకొచ్చారు. త్వరలోనే ఈ పెట్టుబడులుపై ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూలు చేసుకోడానికి రాష్ట్రానికి రానున్నట్లు మంత్రి సవితకు ఆ సంస్థల ప్రతినిధులు తెలిపారు. వీరే కాకుండా దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో మంత్రి సవిత నేతృత్వంలో ఏపీ బృందం చర్చలు జరిపింది. ఏపీలో రూ.400 కోట్ల మేర అప్ సైక్లింగ్‌కు అవకాశాలున్నాయన్నారు. ఈ అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలని పెట్టుబడుదారులకు మంత్రి సవిత సూచించారు. త్వరలో మరిన్ని ఎంవోయూలు కుదుర్చుకోనున్నామని మంత్రి వెల్లడించారు. కర్నాటకకు చెందిన ప్రతినిధులు ఎమ్మిగనూరు టెక్స్‌టైల్స్ పార్క్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపినట్లు మంత్రి సవిత వెల్లడించారు. రష్యాలో టెక్స్‌టైల్స్ వేర్ హౌస్ ఏర్పాటుకు ఏపీకి చెందిన గుంటూరు టెక్స్‌టైల్స్ పార్క్ అంగీకారం తెలిపిందని మంత్రి సవిత వెల్లడించారు.

## చంద్రబాబు బ్రాండ్‌తో పెట్టుబడుల వెల్లువ

అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. న్యూఢిల్లీలో ఈ నెల 14వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన భారత్ టెక్స్-2025 ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ విజయవంతమైందన్నారు. 126 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారన్నారు. భారత్ టెక్స్ వల్ల చేనేత రంగంలో పెట్టుబడులకు, చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు కొత్త అవకాశాలు లభించాయన్నారు. ఖాదీ ఈజ్ ఏ నేషన్...ఖాదీ ఈజ్ బి కమింగ్ ఫ్యాషన్ అంటూ ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు ఎంతో స్ఫూర్తినిచ్చాయన్నారు. దేశంలో వ్యవసాయం తరవాత అత్యధికంగా ఆధారపడిన రంగం చేనేత రంగమేనన్నారు. ఏపీలో చేనేత రంగంపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మహిళలు అత్యధిక శాతం చేనేత ఉత్పత్తుల్లో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే సీఎం చంద్రబాబునాయుడు చేనేత పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. 2014-19 మధ్య చేనేత పరిశ్రమకు, నేతన్నలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. దీంతో ఆ ఐదేళ్లు చేనేతకు స్వర్ణయుగంగా మారిందన్నారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం చేనేతపై చిన్నచూపు చూడడంతో, నేతన్నలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి సీఎం చంద్రబాబు అధికారంలోకి రావడంతో, చేనేత పరిశ్రమకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. చంద్రబాబే ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ అని, ఆయన పాలనాదక్షతపై నమ్మకంతో ఎందరో పెట్టుబడుదారులు ఏపీలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారన్నారు. చేనేతతో సహా మరెన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడుతున్నారన్నారు.

## త్వరలో ఏపీలో పెట్టుబడుదారులతో సమావేశం

భారత్ టెక్స్ అందించిన స్ఫూర్తితో త్వరలో ఆంధ్రప్రదేశ్‌లోనూ చేనేత పరిశ్రమలో పెట్టుబడులు పెట్టేలా సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ముఖ్యంగా పెట్టుబడులు పెట్టేవారికి అనువైన వాతావరణం కల్పించారన్నారు. సుస్థిరమైన పాలనతో పాటు రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఏపీలో పలు దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టాయన్నారు. చేనేత రంగంలోనూ పెట్టుబడులు పెట్టేలా ఏపీలోనూ సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## 35 హస్తకళలకు కేంద్రం గుర్తింపు

వన్ డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్ కింద రాష్ట్రంలో 35 హస్తకళలకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించిందని మంత్రి సవిత వెల్లడించారు. రాష్ట్రంలో ఆయా ప్రాంతాల జీవన విధానాలకనుగుణంగా హస్తకళలు అభివృద్ధి చెందాయన్నారు. ఏటికొప్పాక, ఆదివాసీ సవర చిత్రాలు వంటి హస్తకళలు ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. ఇలా 35 హస్త కళలకు వన్ డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ హస్తకళలకు ప్రోత్సాహం అందించడంతో పాటు ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాయన్నారు. దీనిద్వారా హస్త కళాకారులు గౌరవ ప్రదమైన జీవనం సాగించేలా ఆర్థిక భరోసా లభించే అవకాశముందన్నారు.

## రాష్ట్రానికి చేయూనితనివ్వండి

అంతకుముందు కేంద్ర చేనేత, జౌళి శాఖ కార్యదర్శి బీనాను మంత్రి సవిత కలిసి పలు సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమకు, నేతన్నలకు అండగా నిలవాలని కోరారు. సర్వశిక్ష అభియాన్‌లో చేనేత దుస్తులు వాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర కార్యదర్శి బీనా దృష్టి తీసుకెళ్లారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పలు స్టాళ్ల సందర్శన

భారత్ టెక్స్ సందర్భంగా వివిధ రాష్ట్రాలు, విదేశాలకు చెందిన స్టాళ్లను మంత్రి సవిత సందర్శించారు. ఆయా రాష్ట్రాలు, దేశాల సంప్రదాయలకు అనుగుణంగా తయారైన దుస్తులను పరిశీలించారు. వాటి నాణ్యత, తయారీ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ భవన్‌లో నిర్వహిస్తున్న చేనేత ఎగ్జిబిషన్‌ను కూడా మంత్రి సందర్శించారు. అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పావనమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉదయ్‌పూర్‌లో వాటర్ విజన్-2047

- **నేడు, రేపు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రుల సమావేశం**
- **నిర్వహిస్తున్న కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ**
- **హాజరవుతున్న రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల**
- **కరువు నివారణకు ఏపీ రూపొందించిన వాటర్ పాలసీని వివరించనున్న మంత్రి**

అమరావతి (చైతన్యరథం): రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొంటున్నారు. ఆయా రాష్ట్రాల్లో నీటి సరఫరా, నిల్వల సమర్థ నిర్వహణ, అనుసరిస్తున్న విధానాల గురించి తెలియజేసేలా వాటర్ విజన్-2047 పేరుతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఈ నెల 18, 19 తేదీల్లో ఈ సమావేశం నిర్వహిస్తోంది. ఈ తరహా సమావేశాల్లో ఇది రెండవది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారమే ఉదయ్‌పూర్ చేరుకున్నారు.



ఈ సందర్భంగా ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో టెక్నాలజీని వినియోగించుకుంటూ నీటి సరఫరా, నిల్వల సమర్ధ నిర్వహణలో అమలవుతున్న విధానం గురించి ఇతర రాష్ట్రాల మంత్రులకు మంత్రి నిమ్మల రామానాయుడు వివరించను న్నారు. ఒక పక్క కరువు, మరో పక్క వరదలు, అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రం తీవ్రంగా నష్టపోతున్నందున, వీటిని అధిగమించడానికి చేపట్టే ప్రణాళికలు, వాటర్ విజన్ -2047 పేరిట అమలు చేయబోయే విధానాలు, భూగర్భజలాలు, నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాటర్ పాలసీ గురించి ప్రత్యేకంగా తెలియజేయనున్నారు. విజన్-2047లో భాగంగా నదుల అనుసంధానం,మైక్రో ఇరిగేషన్, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడం ద్వారా చివరి ఎకరం వరకు సాగు నీరు, అదే విధంగా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం, ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకుని భూగర్భ జలాలు పెంపొందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన కార్యాచరణను ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు వివరిస్తారు.

# జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- **మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అభినందన**
- **భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించాలని ఆకాంక్ష**
- **కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని భరోసా**



అమరావతి(చైతన్యరథం): జేఈఈ మెయిన్స్‌లో అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించిన అంబేద్కర్ గురుకుల విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజ నేయ స్వామి అభినందించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా డోలా విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థుల ను మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని మరింత మంది జేఈఈలో భవిష్యత్తులో ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ప్రతీ సంక్షేమ, గురుకులాలు వసతిగృహాల్లో కూడా మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ వసతిగృహాలకు నిర్వహణ నిధులు కూడా కేటాయించలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత రూ.143 కోట్లతో హాస్టళ్లలో మరమ్మతులు చేస్తున్నామని వివరిం చారు. సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో గురుకులాలు, సంక్షేమ వసతిగృహా ల్లో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది కృషిచేయాలని కోరారు. గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం, భద్రతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్య దర్శి ఎం.ఎం.నాయక్, కార్యదర్శి లావణ్య వేణి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోటప్పకొండలో మహాశివరాత్రి ఏర్పాట్లు



- రాష్ట్ర పండుగ హోదాలో వేడుకలకు సిద్ధం
- భక్తులకు సౌకర్యవంతంగా దేవదేవుడి దర్శనం
- ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు
- భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ప్రణాళిక
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి(చైతన్యరథం): మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వచ్చిన భక్తు లందరూ ఎటువంటి ఇబ్బంది లేకుండా పరమేశ్వరుడిని మంచి దర్శనం చేసుకునే విధంగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈనెల 26న మహా శివరాత్రిని పురస్కరిం చుకుని కోటప్పకొండలో ఉత్సవాల ఏర్పాట్లను సోమవారం స్థానిక ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, అరవింద్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. భక్తుల క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, రవాణా, శానిటేషన్, భక్తులకు తాత్కాలిక వసతి తదితర సౌకర్యాలపై అధి కారులతో చర్చించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కోటప్ప కొండ మహాశివరాత్రి తిరునాళ్లను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. లక్షలాది భక్తులు తరలివచ్చే ప్రాంతం కావడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు కోటప్పకొండ ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక శోభ పరిఢవిల్లేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా సమాచార మార్పిడి లోపం లేకుండా మైక్ ప్రచార కేంద్రం నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కోటప్పకొండ ఎంతో అభివృద్ధి జరిగిందని, మాజీ స్పీకర్ దివంగత కోడెల శివప్రసాద్ కోటప్పకొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రమైన కోటప్పకొండ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి దరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా కోటప్పకొండ నిర్వహణను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మహాశివరాత్రి సందర్భంగా పూర్తిస్థాయిలో మౌలిక సదుపా యాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్యూలైన్లు రద్దీ క్రమబద్ధీకరిస్తూ ఉచిత దర్శనంతో పాటు అందరికీ ఆ దేవదేవుని దర్శనం అందేలా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నా మని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ దర్శనం పూర్తిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబా బు నాయకత్వంలో కోటప్పకొండను రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా అభివృద్ధి చేయ డానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కోటప్పకొండకు పూర్వవైభవం తీసు కొచ్చేందుకు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఆయన వెంట స్థానిక కూటమి నాయకులు ఉన్నారు.



## వ్యవసాయ కూలీల దుర్మరణంపై
## సీఎం చంద్రబాబు విచారం

అమరావతి (చైతన్య రథం) గుంటూరు జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను బుడంపాడు సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు వ్యవసాయ కూలీలు మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూలీపనుల కోసం వెళ్తున్న మహిళలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకరమన్నారు. మృతులు అరుణకుమారి, నాంచారమ్మ, సీతారావమ్మ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# బీసీలకు వెన్నుదన్నుగా
# ఆదరణ 3.0 పథకం

- వెలుగులు నింపేందుకు చంద్రబాబు కృషి
- తెలుగుదేశంతోనే వారికి రాజ్యాధికారం
- బీసీలను అణగదొక్కింది జగన్‌రెడ్డే
- అక్రమ కేసులు పెట్టించి ఊచకోత కోశారు
- పథకాలు రద్దు చేసి నిధులు దారిమళ్లించారు
- కల్లు గీత కార్మికులను కూడా వేధించారు
- గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి

మంగళగిరి(చైతన్యరథం): బీసీలకు వెన్నుదన్నుగా ఆదరణ 3.0 పథకం ప్రవేశపెట్టడం జరిగిందని, బీసీల్లో వెలుగులు నింపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పేర్కొన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మంత్రి సవితతో పాటు సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఆదరణ పథకాన్ని పునరుద్ధించాలని నిర్ణ యం తీసుకున్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వానికి బీసీ ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు. కూటమి పాలనలో బీసీలందరూ సంతోషంగా ఉన్నారు. కుల వృత్తులు చేసుకునే బీసీ సోదరులకు ఉండే పథకమే ఆదరణ పథకం. ఆదరణ పథకాన్ని మొట్టమొదటి సారిగా చంద్రబాబు ప్రవేశపెట్టారు. బీసీలకు ఆధునిక పనిముట్లు ఇస్తే వారు నైపుణ్యంతో ఇంకా బాగా అభివృద్ధి చెందుతారన్నది ఆయన ఆశయం. వారిని ఆర్థికంగా ముందుకు తీసుకె ళ్లాలనేదే ఆలోచన. రాష్ట్రంలో ఆదరణ 2 పథకం చంద్రబాబే ప్రవేశ పెట్టారు. 2014-19 మధ్యన 135 కులాలకు రూ.964 కోట్లతో నాలుగు లక్షల మందికి 90 శాతం సబ్సి డీతో ఆనాడు పథకం తెచ్చారు. కులవృత్తులను బట్టి రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేలు ఖరీదు చేసే ఆధునిక పనిముట్లను అందజేశారు. కల్లు గీత కార్మికులు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, గొర్రెల కాపరులకు, వడ్డెర, భవన నిర్మాణ కార్మికులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, చేనేత కార్మికులు, టైలరింగ్, పాల వ్యాపారం, ఎలక్ట్రీషియన్స్ ఇలా కొన్ని లక్షల మందికి తోడ్పాటునిచ్చారని గుర్తుచేశారు.

### బీసీల నోట్లో మట్టికొట్టిన జగన్‌రెడ్డి

2019 తర్వాత జగన్ సీఎం అయ్యాక పథకాన్ని ఎత్తేశారు. నేను విన్నాను... నేను కన్నాను అని చెప్పే జగన్ బీసీలకు ఏమీ చేయకపోగా ఉన్న పథకాన్ని ఎత్తేశాడని మం డిపడ్డారు. బీసీ కులాలు అభివృద్ధి చెందాలంటే ఆదరణ పథకం ఉండాలి. జగన్ అది లేకుండా చేశాడు. పథకాలన్నీ రద్దు చేశారు. నిధులు కూడా డైవర్షన్ చేసేశారు. దాంతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. జగన్ వచ్చాక రాష్ట్రంలో ప్రజలు అనేక బాధలు పడ్డారు. బీసీ వర్గాలకు చెందిన వారిని అణగార్చారు. ఆదరణ పథకాన్ని రద్దు చేయడమే కాకుం డా బీసీలను ఘోరాతి ఘోరంగా హింసించాడు. వారికున్న 30 పథకాలు నిర్దాక్షిణంగా రద్దు చేశారు. 75 వేల కోట్ల నిధులు దారి మళ్లించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బీసీలకు ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ఎలాంటి అవకాశాలు లేని సందర్భం లో మొట్టమొదటిసారిగా అన్న ఎన్టీఆర్ టీడీపీ స్థాపించి బీసీలను ఆదుకున్నారు. నూటికి 50 శాతం పైబడి ఉన్న బీసీల బతుకులు మార్చాలనుకున్నాడు. బీసీలు కులవృత్తుల్లోనే మగ్గిపోతున్నారని గ్రహించారు. వారిలో విద్య, రాజకీయం, వ్యాపారం లేదు.. వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బీసీలకు రాజ్యాధి కారం ఇచ్చారు. స్థానిక సంస్థల్లో ఆయన 20% రిజర్వేషన్ ఇచ్చారు. ఆ తర్వాతే బీసీలు సర్పంచులుగా ఎంపీపీలు, ఎంపీటీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు అయ్యారు. ఆనాడు అంబేద్కర్ దళితవర్గాలకు రాజ్యాధికారం ఇస్తే బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన దేవుడు ఎన్టీఆర్. ఆ 20 శాతం రిజర్వేషన్‌ను చంద్రబాబు 33% చేసి బీసీల బాంధవుడని అని పించుకున్నారని తెలిపారు.

### బీసీలను అవమానించింది నిజం కాదా?

జగన్ హయాంలో బీసీలకు చెందిన 8 వేల ఎకరాల భూములు కబ్జా చేశారు. 70 మందిని ఊచకోత కోశారు. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, జల్లయ్య ఇలా ఎంతో మంది బీసీలని పొట్టన



పెట్టుకున్నారు. 300 మంది మీద తప్పుడు కేసులు పెట్టారు. ఆస్తులు ధ్వంసం చేశారు. కొంతమంది బీసీలు గ్రామాలు వదిలి వెళ్లి పోయే టట్టు చేశా రు. వేట చేసుకుని వేట మీద ఆధారపడే మత్స్యకారులుకు జీవో నెంబర్ 217 తీసుకొచ్చి వాళ్ల నోట్లో మట్టి కొట్టిన మాట వాస్తవం కాదా? వాళ్ల వృత్తిని దెబ్బ కొట్టిన మాట వాస్త వం కాదా? ఆనాడు తెలుగుదేశం హయాంలో వివిధ కుల కార్పొరేషన్లకు అన్ని కార్పొరేష న్లకు కూడా నిధులు ఇచ్చి చాలా పెద్దఎత్తున ఆదుకుంటే.. జగన్ 55 కార్పొరేషన్లు పెట్టా ను అని చెప్పి డబ్బా కొట్టుకుని వాళ్లకు నిధులు ఇవ్వలేదు. చైర్మన్‌లను అవమానించడమే కాకుండా బీసీ సమాజాన్ని అవమానించిన మాట వాస్తవం కాదా? ఒక్క రూపాయి నిధు లు ఇచ్చావా? పేరుకు కార్పొరేషన్లు పెట్టి నిధులు ఇవ్వకపోవడం అవమానించినట్టు కాదా?

### కల్లు గీత కార్మికులపై కేసులు నిజం కాదా?

ఆనాడు చెట్టుపై నుంచి కల్లుగీత కార్మికులు చనిపోతే పది లక్షలు ఇస్తానని చెప్పా వు. నాడు చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు ఇస్తే ..జగన్‌రెడ్డి నేను రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి పది రూపాయలు ఎవరికైనా ఇచ్చావా? కరోనా సమయంలో వాళ్లు కల్లు గీసుకుంటుంటే కేసులు పెట్టి నానా ఆందోళన బీభత్సం చేసిన మాట వాస్తవం కాదా? నేడు బీసీ కార్పొరేషన్ చంద్రబాబు హయాంలో ఎన్టీఆర్ గారి దగ్గర నుంచి కూడా 50% సబ్సిడీ ఇచ్చి 50% రుణం ఇచ్చే పరిస్థితి ఉండేది. లక్ష రూపాయలు సబ్సిడీ ఇచ్చే బీసీ కార్పొరేషన్‌ను మొత్తం కూడా నిర్వీర్యం చేసేశారే. ఎక్కడైనా ఒక్క రాష్ట్రంలో మరి మీ హయాంలో వైసీపీ హయాంలో ఒక్క రూపాయి ఎవరికైనా ఇచ్చారా? ఒక్క రుణం ఇచ్చా రా? అని ప్రశ్నించారు. ఈ విధంగా బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేయటమే కాకుండా బీసీలకు వచ్చే రాయితీలు కూడా రద్దు చేశారు. కనీసం సంచార జాతులకు ఏమీ తెలియదు పాపం..బ్యాంకులకు కూడా వెళ్లలేరు. వారికి కార్పొరేషన్ ద్వారా చంద్రబాబు డైరెక్ట్‌గా రుణాలు ఇస్తుంటే ఆ సంచార జాతుల నోటి దగ్గర కూడు కొట్టిన మాట వాస్త వం కాదా? చిన్న వృత్తులు, చిన్న వ్యాపారాలు చేసుకుంటుంటే వారి నోట్లో మట్టి కొట్టిన మాట వాస్తవం కాదా జగన్‌రెడ్డి? మీ దుర్మార్గాలు, దోపిడీలు, దౌర్జన్యాల్లో అత్యధికంగా బలి అయిపోయింది బీసీలేనని మండిపడ్డారు. బీసీల శవాల పునాదుల మీద మీ వ్యాపార సామ్రాజ్యం నిర్మాణం చేసుకున్నావు. జగన్ సరఫరా చేసిన కల్తీ మద్యం తాగి అత్యధికం గా చనిపోయింది బీసీలే, ఆరోగ్యం పోగొట్టుకుంది బీసీలేనని ధ్వజమెత్తారు.

### బీసీల ద్రోహి జగన్..
### బీసీల బాంధవుడు చంద్రన్న

బీసీల ద్రోహి జగన్ అయితే బీసీల బాంధవుడు చంద్రన్న. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు. ఇవాళ మళ్లీ చంద్రబాబు అన్నమాట ప్రకారం బడ్జెట్‌లో 39 వేల కోట్లు బీసీలకు కేటాయించారు. అంతేకాదు గతంలో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్స్, బీసీ భవ నాలకు నిధులు ఇచ్చారు. గౌడ కులస్తులకు రాష్ట్రవ్యాప్తంగా 10 శాతం మద్యం దుకాణాల్లో వాటా ఇచ్చి ఈ రోజున గీత కులాలను ఆదు కున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం.రాష్ట్ర వ్యాప్తం గా ప్రతి నియోజకవర్గంలో కూడా నాలుగు జన రిక్ షాపులు ఇచ్చి దానికి కూడా 50% సబ్సిడీ ఇచ్చి షాపుల నిర్మాణం కూడా చేసి బీసీలను చిన్న చిన్న వ్యాపారాల్లో పెట్టాలనే ఆలోచన చేస్తు న్నారు. 80 వేల మంది మహిళలకు శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ ఏడాది యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళుతున్నాం. గొర్రెలకు, పాడిగేదెలకు, పశు వులకు రుణాలు ఇచ్చేందుకు ఈ సంవత్సరం మొత్తం కూడా ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేసి బీసీలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

# వైసీపీ ఆక్రమణలో పాఠశాల స్థలం

- పశువుల పాకలో విద్యార్థులకు తరగతులు
- ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొలుసు పార్థసారథి



మంగళగిరి(చైతన్యరథం): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణాంధ్ర నగర్ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని వైసీపీ కార్యకర్త చింతా శ్రీదేవి ఆక్రమించుకుందని కర్రి యోహాను సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావినతుల కార్యక్రమం లో ఫిర్యాదు చేశారు. దాంతో పాఠశాలను పక్కన ఉన్న పశువుల పాకలో నిర్వహిస్తు న్నారని చెప్పారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని..ఈ ఆక్రమణపై చర్యలు తీసుకుని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. మంత్రి కొలుసు పార్థసారథి, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అర్జీలు స్వీకరించారు.

– తమపై దాడి చేసిన వారి మీద కేసు పెడితే పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని కృష్ణా జిల్లా గన్నవరం మండలం దావాజీగూడెంకు చెందిన మొగల్ షాజా ఫిర్యాదు చేశాడు. చర్చల పేరుతో తమను మరోసారి పిలిచి కాళ్లు, చేతులు విరిగేలా తమను ప్రత్యర్థులు తీవ్రంగా కొట్టారని వాపోయాడు. దీనిపై వెంటనే ఉన్న తాధికారులు చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చారు.

– తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని అదనపు కట్నం కోసం తనను చిత్రహింసలు పెడుతున్నాడని నంద్యాల జిల్లా అవుకు మండలానికి చెందిన 19 ఏళ్ల వివాహిత గోడు వెళ్లబోసుకుంది. లెదర్ బెల్టుతో తనను వాతలు పడేలా కొట్టాడని.. భర్త దోమ పుల్లారెడ్డి, అతని కుటుంబం వల్ల తనకు ప్రాణహాని ఉందని కన్నీళ్లు పెట్టుకుంది.

– తన భర్త చనిపోగా వైసీపీ నాయకుల అండతో కొంతమంది ఆయన సంతకా లను ఫోర్జరీ చేసి తమ స్థలాన్ని ఆక్రమించుకున్నారని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం కు చెందిన డి.భారతి తెలిపారు. విచారించి తమ స్థలం కబ్జా నుంచి విడిపించి తనకు న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు.

– తన తండ్రి నుంచి తనకు వాటాగా రావాల్సిన భాగాన్ని తన అన్న శ్రీనివాస రావు తన కుమార్తెల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పల్నాడు జిల్లా దుర్గి గ్రామానికి చెందిన వారణాసి గోవిందయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తనకు రావాల్సిన భాగాన్ని తనకు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశాడు.

– అద్దంకిలో భూమిని కొనుగోలు చేయగా ఆ భూమిని అమ్మిన వ్యక్తి కుమారుడు కొంత ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడని పావులూరి విజయలక్ష్మి విన్నవించు కున్నారు. తాము కొనుగోలు చేసిన భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని అధికా రులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్నా సర్వేయర్ వచ్చి భూమిని కొలవడం లేదని ఫిర్యాదు చేశారు. భూమిని కొలిచి హద్దులు ఏర్పాటు చేసి తమ భూమి కబ్జా కాకుం డా చూడాలని వినతిపత్రం అందజేశారు.

– తమ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి మండలం కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన వేమూరి సుబ్బారావు తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశాడు.

– తమ భూమి వాస్తవంగా ఉండాల్సింది 3.39 సెంట్లు అయితే గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 3.10 సెంట్లుగా తగ్గించి నమోదు చేశారని దీనిపై మళ్లీ సర్వే చేసి తమకు భూమి తమకు ఎక్కించి న్యాయం చేయాలని పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన బోడపాటి చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు.

– గత 20 ఏళ్ల నుంచి స్వీపర్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం కూడా ఇవ్వడం లేదని అనకాపల్లి జిల్లా రూరల్ మండల పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చే నాలుగు వేలలో మళ్లీ రూ.500 తగ్గించి ఇస్తు న్నారని.. దయచేసి జీతం పెంచాలని అభ్యర్థించారు.

– తన తండ్రికి ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాన్ని కంచాల శ్రీను ఆక్రమించుకుని తమను ఇబ్బంది పెడుతున్నాడని కందుకూరుకు చెందిన మణికు మార్ ఫిర్యాదు చేశాడు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకో లేదని.. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కబ్జా నుంచి విడిపించాలని విజ్ఞప్తి చేశారు.

– తమ స్వాధీనంలో ఉన్న భూమి కొంతకాలంగా బీడు భూమి కాగా కబ్జాదారు లు అక్రమ పట్టాదారు పాసుపుస్తకాలు పుట్టించుకుని రికార్డుల్లో పేర్లు మార్చారని ఏలూరు జిల్లా దెందులూరు మండలం పెరుగుగూడెంకు చెందిన గారపాటి గాంధీ తదితరులు ఫిర్యాదు చేశారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.







## దారితప్పిన వైద్యుడిపై బదిలీ వేటు

- అక్రమాలు, క్రమశిక్షణా రాహిత్యంపై చర్యలు
- సమగ్ర విచారణకు మంత్రి సత్యకుమార్ ఆదేశం

అమరావతి(చైతన్యరథం): ప్రభుత్వాసుపత్రుల్లో సేవలను మెరుగుపర్చే ప్రయత్నా ల్లో భాగంగా విధులు సరిగా నిర్వర్తించకుండా అక్రమాలు, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకు మార్ యాదవ్ ఆదేశించారు. 2019-24 కాలంలో అప్పటి ప్రభుత్వ అలసత్వం వల్ల ప్రభుత్వ వైద్యుల్లో నెలకొన్న నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, సర్వీసు నిబంధనల ఉల్లంఘనపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దారితప్పి వ్యవహరిస్తున్న వైద్యుల వైఖరిని కట్టడి చేసే చర్యల్లో భాగంగా విశాఖ కింగ్ జార్జ్ ప్రభుత్వాసుపత్రి ఆర్థోపెడిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అంపోలు అచ్యుతరావును తక్షణమే ఏలూరు ప్రభుత్వ సర్వజ నాసుపత్రికి బదిలీ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఆయనపై వచ్చిన పలు ఫిర్యాదులపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని కూడా ఉత్తర్వులిచ్చా రు. దివ్యాంగులకిచ్చే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడటం, ఆపరేషన్లు చేయడానికి డబ్బు తీసుకోవడం, శస్త్రచికిత్సల్లో వైఫల్యాలు



ఎక్కువగా ఉండటం, సహ చర సిబ్బంది, వైద్య విద్యార్థులపై దురుసు ప్రవర్తనతో ఆసుపత్రి సూప రింటెండెంట్ ఇతర సీనియర్ల ఆదేశాలు ఉల్లంఘిస్తు న్నట్లు ఆరోపణలు మంత్రి దృష్టికొచ్చాయి. ఈ వైఖరి ద్వారా అచ్యుతరావు వైద్యుల ప్రవర్తన, సర్వీసు నియమాలు ఉల్లంఘించినం దున మంత్రి చర్యలకు ఆదేశించారు. డాక్టర్ల అనుచిత ప్రవర్తన, క్రమ శిక్షణా రాహి త్యం వల్ల ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యం దెబ్బ తింటుందంటూ అటువంటి విషయాల్లో కఠిన చర్యలు ఎంతైనా అవసరమని పేర్కొన్నారు.

## రేపు పద్మావతి మహిళా యూనివర్సిటీకి మంత్రి లోకేష్

- ఖేలో ఇండియా మల్టీపర్పస్ స్టేడియం ప్రారంభం
- శాప్ చైర్మన్ రవినాయుడు వెల్లడి

తిరుపతి (చైతన్యరథం): ఈనెల 19వ తేదీన రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో కేంద్ర ప్రభు త్వం, మహిళా యూనివర్సిటీ, శాప్ నిధులతో నిర్మిం చిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ రవినాయుడు తెలియజేశారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ రవి, పీఈడీ ఎస్.సరోజినీ, డీస్డీడీఓ సయ్యద్ సాహెబ్‌లతో కలిసి వైస్ ఛాన్సలర్ ఛాంబర్లో ఏర్పాట్ల నిర్వహణపై సోమవారం సమీక్షించిన అనంతరం శాప్ చైర్మన్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు యూనివర్సిటీ అధికారులు కృషి చేయాలన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ వేదికగా క్రీడాకారిణులను తయారుచేసేందుకు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు. అనంతరం ఇండోర్‌స్టేడియం,ఆడిటోరియంలోని ఏర్పా ట్లను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు, యూని వర్సిటీ సిబ్బందికి శాప్‌చైర్మన్ పలుసూచనలు చేశారు. వైస్ ఛాన్సలర్ ఉమ మాట్లాడుతూ క్రీడాకారిణులకు యూనివర్సిటీలో శిక్షణ వేదిక లభించడం గొప్ప అవ కాశం అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్వీయూ కల్చరల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ డా.వివేక్, డా. హరికృష్ణ, డీఎస్‌డబ్ల్యుఓ నజీర్ హుస్సేన్, నాయకులు మహేష్ యాదవ్, రంజిత్‌కుమార్, తోట వాసు, హేమంత్ రాయల్, వర్సిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

## ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలి : గుమ్మడి సంధ్యారాణి

విజయనగరం (చైతన్యరథం): రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయులు నిరుద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కున్నారని మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలిపించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఎమ్మెల్యే జయకృష్ణ. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌తో కలిసి జరిగే సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు జీతాలను ఆలస్యంగా ఇవ్వడం వారితోనే మరుగుదొడ్లను శుభ్రం చేయించడం వంటి పనులు చేసి అవమానించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులకే మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు.



## వైద్యులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



●రాజమండ్రి ఈఎస్ఐ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సుభాష్

●సిబ్బంది హాజరు పట్టి చూసి అసహనం వ్యక్తం

రాజమండ్రి (చైతన్యరథం): ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. సోమవారం రాజమండ్రిలోని ఈఎస్ఐ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఉద్యోగుల హాజరు పట్టిను పరిశీలించి సక్రమంగా విధులకు కాని, గైర్హాజరైన ఉద్యోగుల తీరుపై మండిపడ్డారు. రోగులకు అందాల్సిన సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రస్థాయిలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈఎస్ఐ హాస్పిటల్ సువరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, మరి కొంతమంది సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు చార్జ్ మెమోలు ఇవ్వాలని ఆదేశాలు జరిచేశారు. పనితీరు మార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత ఈఎస్ఐ హాస్పిటల్‌కి చేరుకున్న మంత్రి సుభాష్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న పారిశుధ్యం నిర్వహణ, సిబ్బంది రోగులు పట్ల అనుసరిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరు పట్టిని క్షుణంగా పరిశీలించారు. కొంతమంది సిబ్బంది విధులకు దుమ్మా కొట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తుందని, దీనిలో భాగంగా రాజమండ్రి ఈఎస్ఐ హాస్పిటల్ 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలు త్వరలోనే సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన్యం అభివృద్ధి చూసి ఓట్లేయండి

రంపచోడవరం (చైతన్యరథం): అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టిందని వీటిని చూసి పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయాలని కూటమి పార్టీల ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్లు పిలుపునిచ్చారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి నుంచి బరిలో ఉన్న పేరాబత్తుల రాజశేఖరానికి ఓట్లువేసి గెలిపించాలని కోరారు. రంపచోడవరం మండలం బి. వెలమలకోట, ఐ. పోలవరం, సీతపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపిస్తే ఎమ్మెల్యే నిధులను కేటాయించడంతో పాటు ఎమ్మెల్సీలు కూడా మండలిలో చర్చించి ఏజెన్సీ అభివృద్ధికి దోహదపడతారని హామీ ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన



శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కారం సురేష్, మాజీ అధ్యక్షుడు అడబాల బాపిరాజు, సర్పంచి వంతల అచ్చియమ్మ, జనసేన మండల అధ్యక్షుడు పాపోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం రైల్వే స్టేషనన్ను రైల్వేశాఖ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫక్వాన్, ఎమ్మెల్యే విజయచంద్ర కలిసి సందర్శించారు. స్టేషన్ పరిధిలో సమస్యలను తెలుసుకున్నారు. గతంలో పార్వతీపురం పళ్ళ వ్యాపారులకు ఒడిశా ఇతర ప్రాంతాలకు సరకు తరలించే అవకాశం ఉండేదని వివరించారు.

లోడింగ్ అన్ లోడింగ్ పాయింట్ ఎత్తివేయడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైల్వే జీఎంకు తెలియజేశారు. రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా దశాబ్దాలుగా ఇతర ప్రాంతాలతో రాకపోకలు రైల్వే స్టేషన్ వెళ్లేందుకు చిన్న మార్గాన్ని మూసేయకుండా యధావిధిగా కొనసాగించాలని తెలియజేశారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి (చైతన్యరథం): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఇళ్లు, పింఛన్ల మంజూరు, ఉపాధి అవకాశాలు, రోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. నిమ్మాడలోని దివంగత నేత మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఘాట్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం సందర్శించారు. ఈనెల 23న ఎర్రన్నాయుడు జయంతి వేడుకల



నిర్వహణపై ఆయన సోదరులు కింజరాపు ప్రభాకర్, హరివరప్రసాద్‌లతో చర్చించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మా గ్రామానికి తాగునీటిని సరఫరా చేయండి



కురుపాం (చైతన్యరథం): తమ గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కొరడగూడ గ్రామస్తులు నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం, దుమ్మంగి పంచాయతీకి చెందిన కొరడగూడ గ్రామస్తులు మంచినీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గామంలో సుమారుగా 25 కుటుంబాలు జీవనం సాగిస్తున్నామని, మంచినీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిరంతరం కృషి చేస్తానని, ఏ అవసరమొచ్చిన తనను సంప్రదించాలని తోయక జగదీశ్వరి తెలిపారు.

## పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలి



భీమవరం (చైతన్యరథం): తూర్పు పశ్చిమగోదావరి ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి భీమవరం టౌన్‌లో ఎన్నికల ప్రచారాన్ని భీమవరం నియోజవర్గం స్థానిక శాసనసభ్యులు పులవర్తి రామాంజనేయులు మాజీ పార్లమెంట్ సభ్యులు భీమవరం నియోజవర్గం ఇన్‌ఛార్జ్ తోట సీతామాలక్ష్మీ భీమవరం నియోజవర్గం ఎన్నికల పరిశీలకులు మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి, బుద్ధనాగ జగదీశ్వరరావు ప్రచారంలో పాల్గొన్నారు. సమావేశంలో నాగ జగదీష్ మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్స్‌ను కలుసుకొని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు 20 లక్షల ఉద్యోగాలు ఎన్నికల్లో చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీలు ప్రకారం ఏడు మాసాల్లో 6 లక్షల 43 వేల కోట్లు పెట్టుబడులతో నాలుగు లక్షల ఉద్యోగాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, అలాగే మెగా డీఎస్సీ వల్ల 16,464 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. రాజశేఖరంకు మొదట ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ ప్రెసిడెంట్ ఇందూరి సుబ్రమణ్యం రాజు, టీడీపీ నాయకులు పుత్తూరు బాపిరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత ఓటుతో "పేరాబత్తుల"ను గెలిపించండి

### టీచర్ల ఓటును అభ్యర్థించిన మాజీ ఎమ్మెల్యే, కో ఆర్డినేటర్ "పిల్లి"

కాకినాడ (చైతన్యరథం): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని, 76ఏళ్ల వయసులోను సీఎం చంద్రబాబు సమావేశాలు, సమీక్షలతో అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారని కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి కొనియాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని నేమం, పండూరు, తిమ్మాపురం, సూర్యారావుపేట, వాకలపూడి, రామనయ్యపేట, సర్పవరం, కొవ్వాడ, చీడిగా, ఇంద్రపాలెం, తురంగి తదితర పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మీ, ఎన్టీఆర్ వైద్యసేవ చైర్మన్, విశాఖ సౌత్ ఇన్‌ఛార్జ్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ సీతం రాజ్ సుధాకర్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, నియోజవర్గ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ శ్రేణులతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయుల ఓట్లను ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఐదేళ్లపాటు అణిచివేత ధోరణిలో ఉన్న రాష్ట్రానికి మళ్లీ పోలవరం,



అమరావతి రాజధాని వస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల ప్రాజెక్టుగా మార్చేసిందని కేంద్ర ప్రభుత్వ సాయంతో ఆ పథకానికి జవసత్వాలు వచ్చాయన్నారు. ప్రధానమంత్రి మోడీ రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు రెండు లక్షల కోట్లు పెట్టుబడులు అందించి శంకుస్థాపన చేశారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసం సృష్టించిందని కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఎనిమిది నెలల్లో చేసిన అభివృద్ధిని గమనించాలని అన్నారు. గత ప్రభుత్వం టీచర్లను ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టిందని, కొందరు టీచర్లు పీఆర్సీ, డీఎలపై ఆశలు పెట్టుకున్నారని వాటిని కూటమి ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు.

## విజ్ఞానవంతుడు పేరాబత్తులకు పట్టం కడదాం : ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజ్ఞతతో ఆలోచించి విజ్ఞాన వంతుడైన పేరాబత్తుల రాజశేఖరానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కోర్టు ఆవరణలోని ది రాజమండ్రి బార్ అసోసియేషన్ హాల్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో నిలిచిన పేరాబత్తుల రాజశేఖరం మంచి ఆలోచనపరులని, నిరుద్యోగుల సమస్యల పట్ల గళం వినిపిస్తారని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల విజయమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పేరాబత్తుల రాజశేఖరానికి ఒక్క అవకాశం ఇస్తే పట్టభద్రుల ప్రయోజనాలను కాపాడుతారన్నారు. నిరుద్యోగుల సమస్యలనూ ప్రభుత్వం దృష్టికి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఏడేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపులు, వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2023లో టీడీపీ గెలిచిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేశాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఏ విధంగా అయితే కృషి చేశారో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెట్టింపు స్థాయిలో కృషి చేసి రాజశేఖరానికి విజయం చేకూర్చాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుందని, ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లో పార్టీ సింబల్ ఉండదని.. క్రమ సంఖ్యలో నెంబర్లు ఉండి పేర్లు మాత్రమే ఉంటాయని... కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు ఎదురుగా ఉన్న గడిలో 1వ నెంబర్ వేసి ఆయనకు అఖండ విజయం చేకూర్చాలని న్యాయవాదులను కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరసాపురంలో జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



నరసాపురం (చైతన్యరథం): పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గం మొగల్తూరు మండలం కె.పి పాలెం నార్త్, సౌత్ ప్రాంతాలు, పేరుపాలెం నార్త్, సౌత్ ప్రాంతాల్లో ఉన్నా హైస్కూల్, ఎలిమెంట్రీ స్కూల్స్, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంని అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరుతూ నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఎన్డీయే ఎనిమిది నెలల పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపిస్తే చట్టసభల్లో యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసాపురం నియోజకవర్గ పరిశీలకులు గుత్తుల సాయి, నరసాపురం నియోజకవర్గ ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల పరిశీలకులు సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దృష్టికి కొల్లేరు సమస్య : ఎంపీ పుట్టా మహేష్



ఏలూరు (చైతన్యరథం): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యపై చర్చించడానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలతో కలిసి ఈనెల 20న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలుస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు శాంతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ మహేష్ కుమార్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించిన అనంతరం కొల్లేరు సమస్య పరిష్కారానికి ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై స్పష్టత వస్తుందని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అండగా ఉంటారని, ఏలాంటి ఆందోళన చెందవద్దని ఎంపీ పేర్కొన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో కొల్లేరు సమస్య పరిష్కారానికి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందని, గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల ప్రస్తుతం కొల్లేరు ప్రాంత ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో కొల్లేరు ప్రాంత ప్రజలు తమ ఎదుట వ్యక్తం చేసిన ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి చంద్రబాబు దిద్దుబాటు చర్యలు చేపట్టారని ఎంపీ వెల్లడించారు. మొదట ప్రజల తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేయలని భావించగా, న్యాయ నిపుణుల సలహా మేరకు ప్రభుత్వమే పిటిషన్ దాఖలు చేస్తుందని ఎంపీ తెలిపారు. అలాగే మరోసారి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు.

రానున్న రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు పనులు ముమ్మురంగా జరుగుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన ఎనిమిది నెలల్లోనే ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచి మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కుతుదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను కూడా త్వరలోనే అమలు చేయడానికి ప్రభుత్వ సిద్ధంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి... రాజోలులో ఎన్నికల ప్రచారం



రాజోలు (చైతన్యరథం): ఈనెల 27వ తేదిన జరగబోయే ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్ రాజు అన్నారు. సోమవారం బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం, రాజోలు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్డీయే అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం పోటీ చేస్తున్నారని, మొదటి ప్రాధాన్యత ఓటుగా సూచించి, అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృదికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల తరుపున పోరాటం చేసే వ్యక్తి పేరబత్తుల రాజశేఖరంని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు నాగిరెడ్డి సూర్య, నిమ్మకాయల శేషు, మంద రాజేష్, యల్లమెల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించండి : బోళ్ళ వెంకటరమణ

పెద్దాపురం (చైతన్యరథం): ఈ నెల 27 తేదిన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గం కూటమి నేతలు పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ జి.రాగంపేట గ్రామంలోని సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలధాని సుబ్రమణ్యం, అడపా వెంకటేష్, మోటూరి వీరబాబు, దూసర్లపూడి ఏసుబాబు, దేవళ్ల వరప్రసాద్, సాంబత్తులు వెంకటేష్, మంగరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పేరాబత్తులకు మద్దతు తెలపండి : వాసిరెడ్డి రాంబాబు పిలుపు



కొత్తపేట (చైతన్యరథం): ఉభయ గోదావరి జిల్లాలు పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కొత్తపేట నియోజకవర్గం అబ్జర్వర్, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పి.వి.జి.కుమార్, కోత్తపేట నియోజవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు కోరారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలోని పాఠశాలలకు వెళ్ళి ఓట్లను అభ్యర్దించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టీడీపీ మహిళా అధికార ప్రతినిధి, మాజీ జడ్పీటీసీ పి.సత్యవతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, గ్రామ పార్టీ అధ్యక్షులు కుదప కృష్ణమూర్తి, సర్పంచ్ ముత్తాబత్తుల రాజు, 181వ బూత్ కన్వీనర్, సెంట్రల్ డెల్టా ప్రాజక్టు కమిటీ వైస్.ఛైర్మన్ కరుటూరి నరసింహరావు, మండల తెలుగురైతు అధ్యక్షుడు వరప్రసాద్, నియోజకవర్గ యవత ఉపాధ్యక్షుడు రవిప్రసాద్, బూత్ ప్రతినిధులు కరుటూరి వెంకటేశ్వరరావు, తీట్లశ్రీను, తూము వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జగ్గంపేటలో వారంతాపు అన్న క్యాంటీన్ నిర్వహణ



జగ్గంపేట (చైతన్యరథం): స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత మూడు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్‌ను సోమవారం నిర్వహించారు. కు ఈ వారం జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మారిశెట్టి భద్రం, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ మారిశెట్టి పాపా రత్నం తనయుడు మారిశెట్టి జగ్గారావు, మౌలిక దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ అన్నా క్యాంటీన్‌ను మారిశెట్టి భద్రం ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా మారిశెట్టి భద్రం మాట్లాడుతూ... పేదవాడి ఆకలి తీర్చాలని తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ స్ఫూర్తితో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ జగ్గంపేటలో గత మూడు సంవత్సరాలుగా దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం జగ్గంపేటలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసే వరకు దాతల సహకారంతో కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ టీడీపీ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, జగ్గంపేట లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మారిశెట్టి రాధా, కింగం రమణ, నలమాటి ఆనంద్, దేగల సత్తిబాబు, ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు, కోడూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో పరిపూర్ణత సాధించడానికి మేలైన మార్గం ధ్యానం: చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): ప్రతిఒక్కరి జీవితంలో పరిపూర్ణత సాధించడానికి మేలైన మార్గం ధ్యానమేనని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. వ్యక్తిగతంగా తానూ ధ్యానం మొదలు పెట్టిన తర్వాతే జీవితంలో నిజమైన అభివృద్ధిని, మార్పును చూశానని తెలిపారు. బ్రహ్మకుమారీ సమాజం ద్వారా నేర్చుకున్న రాజయోగ జీవితంలో తనకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మనసు బాలేనప్పుడు రాయయోగ, ధ్యానం చేయడం ద్వారా వెంటనే సాధారణ పరిస్థితికి వస్తామని, సంతోషంగా అనిపిస్తుందని తెలిపారు. వినుకొండ ఇసుకవాగు బజార్‌లో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివ జయంతి మహొత్సవం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ... బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. కష్టాలను ఎలా అధిగమించాలనేది ధ్యానం, బ్రహ్మ కుమారీల ద్వారానే నేర్చున్నట్లు తెలిపారు. చిన్నచిన్న ఆనందాలను సంతోషంగా తీసుకుంటునే జీవితంలో సానుకూలంగా ముందుకెళ్తామన్నారు. శివబోధలు గురించిఅందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే కొండపై రామలింగేశ్వరస్వామి గుడి నిర్మాణం పూర్తి చేసి అక్కడ బ్రహ్మకుమారీలతో కార్యక్రమాలు ఏర్పాటు చేయించాలని తన కోరికగా తెలిపారు.

# ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి : నక్కా




వేమూరు (చైతన్యరథం): ఈనెల 27వ తేదిన జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. సోమవారం చుండూరు మండలంలోని చుండూరు జిల్లా పరిషత్ హైస్కూల్, చుండూరులోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, వేటపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, యడ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లోని ఉపాధ్యాయులను కలిసి ఆలపాటి రాజాకి పట్టభద్రుల ఎన్నికలలో తమ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్డీయే కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్న ఆయన... వైసీపీ పాలనలో దగాపడిన రాష్ట్రాన్ని పున:నిర్మించే సత్తా ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థికి తొలి ప్రాధాన్యత ఓటేయండి



పెడన (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం పెడన మండలం, కాకర్లమూడి గ్రామంలో పట్టభద్రులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించి శాసన మండలికి పంపాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థికి తొలిప్రాధాన్యత ఓటేయాలని కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగురాళ్ల మున్సిపాలిటీ టీడీపీ కైవసం




పిడుగురాళ్ల (చైతన్యరథం): పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ కొత్త చినసుబ్బారావు టీడీపీ కండువా వేసుకున్నారు. మరోవైపు మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా టీడీపీ కౌన్సిలర్ ఉన్నం భారతి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశానికి 17 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. వైస్ ఛైర్మన్‌గా 30వ వార్డు కౌన్సిలర్ ఉన్నం భారతిని ఓ కౌన్సిలర్ ప్రతిపాదించగా.. మిగిలినవారు మద్దతు తెలిపారు. దీంతో వైస్ ఛైర్మన్ గా భారతి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

# గియాన్ బరే సిండ్రోమ్ వ్యాప్తిపై వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి : మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): గియాన్ బరే సిండ్రోమ్ (జీ.బీ.ఎస్) కేసుల నమోదు, కలకలం దృష్ట్యా నియోజకవర్గ వైద్యారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు తగుసూచనలు సలహాలు అందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మహారాష్ట్రలో కలకలం సృష్టించిన సిండ్రోమ్ ప్రభావం, ఏపీలోనూ కనిపిస్తోందని ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, ప్రజల్ని అప్రమత్తం చేసి, సిండ్రోమ్ లక్షణాలపై వారికి అవగాహన కల్పించాలని పుల్లారావు ఆదేశించారు. నియోజకవర్గ వైద్యసిబ్బంది కూడా సత్వరమే స్పందించాలన్నారు. ప్రజలు సిండ్రోమ్ గురించి తెలుసుకొని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజారోగ్యం విషయంలో కూటమిప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటోందని, సిండ్రోమ్ వ్యాప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే వైద్యశాఖతో పాటు అనుబంధ శాఖల్ని అప్రమత్తం చేశారని పుల్లారావు చెప్పారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు.. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, మంచి పౌష్టికాహారం, పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలని పుల్లారావు సూచించారు. నరాలు ఒక్కసారిగా చచ్చుబడినట్టు అనిపించడం.. కండరాలు బలహీనంగా ఉండటం.. చేతులు, కాళ్లల్లో తిమ్మిరి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, వారి పర్యవేక్షణలో చికిత్స పొందాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ లక్షణాలకు ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ముందు జాగ్రత్తలతో సమస్య నుంచి బయటపడవచ్చని ఆయన స్పష్టంచేశారు.

# ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం లాంఛనమే : యార్లగడ్డ




నిడమానూరు (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ నిడమానూరు నారాయణ కళాశాలలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ... శాసనమండలిలో సీనియర్ నాయకుడు రాజేంద్రప్రసాద్ సేవలు అవసరమన్నారు. కూటమి ప్రభుత్వంలో వాట్సాప్ కాల్స్ మాట్లాడే స్థితి నుండి మామూలు కాల్స్ మాట్లాడే స్థితికి ప్రజలు వచ్చారని అన్నారు. పెద్ద సభలకు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గౌరవాన్ని తీసుకువస్తానని అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో 1వ నెంబర్ వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. గన్నవరం నియోజకవర్గంలో 14,500 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని నియోజకవర్గం నుండి భారీ మెజారిటీ కల్పించాలనీ పిలుపునిచ్చారు. గన్నవరం అభివృద్ధికి కోసం కట్టుబడి పని చేస్తున్నాను అని చెప్పటం తాను చేసే అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలనీ కోరారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరి ఓటు హక్కును వినియోగించుకోవాలనీ కోరారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... తన గెలుపు కూటమి గెలుపు అని అన్నారు. మంచి ప్రభుత్వానికి మరో సారి ఓటర్లు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు హరిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, గన్నవరం నియోజకవర్గ బీజేపీ పార్టీ అధ్యక్షులు ఫణి కుమార్, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల మృతిపట్ల ఎంపీ పెమ్మసాని సంతాపం



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర శివారులోని బుడంపాడు - నారాకోడూరు రహదారిపై సోమవారం జరిగిన ఘోర ప్రమాదం పట్ల గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వేజెండ్ల మండలం సిద్ధపల్లి గ్రామానికి చెందిన వలస కూలీలు బుడంపాడు వద్ద సోమవారం ఉదయం మిరపకాయల కోతపనికి వెళ్తుండగా జరిగిన ప్రమాదం జరిగింది. సంఘటన విషయం తెలుసుకున్న పెమ్మసాని చంద్రశేఖర్... క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందజేయాలని జీజీహెచ్ సూపరిండెంట్ యశస్వీ రమణను ఆదేశించారు. మృతి చెందిన ముగ్గురు వ్యవసాయ కూలీల కుటుంబాలతో పాటుగా క్షతగాత్రులను కూడా ప్రభుత్వం తరఫున తక్షణమే ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మికి సూచించడంతోపాటు ప్రమాదం జరగడానికి గల కారణాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతి చెందిన వ్యవసాయ కూలీలు అరుణ, సీతారావమ్మ, నాంచారమ్మల మృతి పట్ల ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో పదిమంది ప్రయాణిస్తున్నారని తెలుసుకొని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రజలను తీసుకెళ్తున్న ఆటోలు, ఇతర వాహనాలపై చర్యలు తీసుకోకుండా రవాణా శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని అధికారులకు పెమ్మసాని ఆదేశించారు.

# ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని మాంటిసోరి, టౌన్ హై స్కూల్ తదితర విద్యాసంస్థలకు వెళ్లిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము... ప్రథమ ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు వేసి గెలిపించాలంటూ ఉపాధ్యాయులను విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా పట్టభద్రులకు ఆలపాటి రాజా గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ... ప్రచార కరపత్రాలను అందచేశారు. ఆలపాటి రాజా లాంటి మంచి వ్యక్తి శాసనమండలిలోకి అడుగుపెడితే... పెద్దల సభకు మరింత గౌరవం పెరుగుతుందన్నారు. ప్రధానంగా గుడివాడ అభివృద్ధికి ఆయన సహకారం ఉంటుందన్నారు. ప్రజల మంచి కోసం పట్టభద్రులందరూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో గుడివాడ పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నియోజకవర్గపార్టీ పరిశీలకురాలు నూకాలమ్మ, టీడీపీ నాయకులు అడుసుమిల్లి శ్రీధర్, మాంటిసోరి స్కూల్ ప్రిన్సిపల్ పద్మావతి, టౌన్ హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

**అభివృద్ధిపై మంత్రి నారాయణ దృష్టి**



- పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పనకు కృషి
- ప్రధానోపాధ్యాయులతో సమావేశం
- విద్యార్థులు ఆడుకునేందుకు వీలుగా ప్లే ఎక్విప్మెంట్, జిమ్ ఎక్విప్మెంట్ సరఫరా
- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య

నెల్లూరు, (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దృష్టి సారించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజతో కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొత్తం నెల్లూరులో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి వాటి స్థితిగతులపై పూర్తి వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి కాకుండా తరగతి గదికి ఒక ఉపాధ్యాయుండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సీఎస్సార్ నిధులతో అన్ని పాఠశాలల్లో మూడు నెలల్లోగా పిల్లలకు అవసరమైన ఆట వస్తువుల ఏర్పాటు చేస్తామన్నారు. పాఠశాలల్లో గ్రౌండ్ విస్తీర్ణాన్ని బట్టి వివిధ రకాల క్రీడా పరికరాలను సమకూర్చుతామన్నారు.

త్వరలో తరగతి గదుల్లో ఇంట్రాక్టివ్ బోర్డుల ఏర్పాటు చేస్తామన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో చర్చించి పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు హై క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తామన్నారు.

**గంటబడిని బాగు చేస్తా**

స్థానిక సంతపేట గుంటబడి (ఆదర్శ పాఠశాల)ను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సోమవారం సందర్శించారు. పాఠశాల ఆవరణలో ఉన్న అతిపెద్ద క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయవలసిన ప్లే ఎక్విప్మెంట్, జిమ్ ఎక్విప్మెంట్లతో పాటు గ్రౌండ్ చుట్టూ ముందుగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సంతపేట గుంటబడిగా పిలువబడే ఆదర్శ పాఠశాల క్రీడా మైదానం చెత్తాచెదారాలతో నిండిపోయి దారుణంగా ఉండడం చూసి ప్లే గ్రౌండ్ను 48 గంటల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. ఇంత పెద్ద ఆట స్థలంలో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా బాస్కెట్బాల్ ఫుట్బాల్, కోకో, నెట్ క్రికెట్, బ్యాడ్మింటన్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్లే గ్రౌండ్ శుభ్రపరిచే కార్యక్రమం పూర్తయిందని ఆయా క్రీడలకు కోర్టులను నిర్మించేందుకు మరో మూడు అడుగుల ఎత్తు ఉండాల్సి ఉందని చెప్పారు. దశలవారీగా ఈ క్రీడ మైదానాన్ని సుందరీకరించి సంవత్సరంలోగా పూర్తి చేస్తామన్నారు. నెల్లూరులోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆయా పాఠశాలల్లో ప్లే గ్రౌండ్ విస్తీర్ణాన్ని



బట్టి ఆట వస్తువులను వ్యాయామ వస్తువులను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతోపాటు ప్రతి పాఠశాలలో ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆక్ట్ సంస్థను సంప్రదించామన్నారు. పాఠశాలల్లో ఇంటర్నెట్ సేవలను ఉచితంగా అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత వైసీపీ ప్రభుత్వం 10 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి పెట్టడంతో ప్రస్తుతం ఖజానాల్లో డబ్బులు లేవన్నారు. ప్రజలు కొద్ది రోజులు ఓపిక పడితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, 49వ డివిజన్ టిడిపి ముఖ్య నాయకులు రంగన్న, కప్పిర శ్రీనివాసులు, కప్పిర రేవతి, 42వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఇతర అధికారులు ఉన్నారు.

## భైరవకోన బస్సు ప్రారంభం..!

**- భక్తుల కోసం సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్**



ఉదయగిరి, (చైతన్యరథం): ఉదయగిరి నుంచి భైరవకోన వయా సిద్దేశ్వరం బస్సు సర్వీసును ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సోమవారం ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం, సిద్దేశ్వరం, భైరవకోనను పర్యాటక కేంద్రంగా, అభివృద్ధి చేసుకునే క్రమంలో, బస్సు సర్వీసును ప్రారంభించారు. ముందుగా పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, బస్సు ద్వారం దగ్గర రిబ్బన్ కటింగ్ చేసి, జెండా ఊపి, బస్సును స్టార్ట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సహకారంతో, భక్తుల కోరిక మేరకు, అవసరం దృష్ట్యా బస్సు సర్వీసును, ఏర్పాటు జరిగిందన్నారు. ఈ సర్వీసు వారంలో ఒక్కరోజు అనగా సోమవారం ఉదయం 7:30 గంటలకు ఉదయగిరిలో బయలుదేరి సిద్దేశ్వరం వెళ్లి అక్కడ నుండి నేరుగా భైరవకోనకు చేరుకుంటుంది. అక్కడ గంట వ్యవధి తర్వాత తిరిగి ఉదయగిరి కి చేరుకుంటుంది. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. గత ఎనిమిది నెలల కాలంలో ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాసరావు సహకారంతో అనేక ప్రాంతాలకు బస్సు సర్వీసులను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఉదయగిరి కూటమి నాయకుల, సారథ్యంలో మెట్ట ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

## ఆదర్శగ్రామాల సాధనే కూటమి లక్ష్యం

**- టీడీపీ నేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి**



చిన్నమండెం, (చైతన్యరథం) : రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చి దిద్దడం జరుగుతుందని రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం, చిన్నమండెం టౌన్ లో 38.50 లక్షలు, దేవగుడిపల్లి గ్రామం, జల్లావాండ్లపల్లెలో 12.50 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రాయచోటి నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోక గ్రామాలు ఎంతో వెనుకబడి ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలవలు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు నూతన బోర్లు వేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇలా గ్రామాలలో అవసరాలను బట్టి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని రానున్న రోజులలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు.

## డాక్టర్ సాగర్‌కు ‘టైమ్స్ ఐకానిక్ అఫ్ హెల్త్‌కేర్’ అవార్డు

**- కిడ్నీ సర్జన్‌గా ఏపీలోనే టాప్ 5గా నిలిచిన కడియాల**

**- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతులమీదుగా అవార్డు ప్రదానం**



దర్శి, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే యూరాలజీ వైద్యవిభాగ సేవలందించడంలో టాప్ 5 కిడ్నీ సర్జన్‌గా డాక్టర్ కడియాల లలిత్ సాగర్ నిలిచారు. ఇందుకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ‘టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్’ అవార్డును డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దక్కించుకున్నారు. విశాఖపట్నంలో జరిగిన ‘టైమ్స్’ మెగా కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఐకానిక్ లీడర్ హెల్త్ కేర్ పేరిట అత్యుత్తమ వైద్య సేవలందించిన వైద్యులకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం ప్రతిభావంతులను ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్- 2025ను కిడ్నీ (యూరాలజీ ) సర్జన్ డాక్టర్ కడియాల లలిత్ సాగర్ అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడమనేది యూరాలజీ వైద్య విభాగం పట్ల ఆయన అంకితభావం, నైపుణ్యం, నిబద్ధతకు గుర్తింపుగా చెప్పుకోవచ్చు. వైద్యరంగంలో ప్రముఖ కిడ్నీ సర్జన్‌గా సేవలందించడంలో నాణ్యతను మెరుగు పరచడానికి డాక్టర్ కడియాల లలిత్ సాగర్ చేసిన ప్రయత్నాలు ప్రశంసనీయంగా నిలిచాయి. అవార్డు స్వీకరించిన డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మీడియాతో మాట్లాడుతూ పలువురు వైద్య ప్రముఖుల సమక్షంలో టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్ అవార్డును కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకోవడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం హయాంలోనే వైద్యులకు తగిన ప్రోత్సాహం కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. ఖరీదైన వైద్యాన్ని కూడా తక్కువ ఖర్చుతో అందించాలనే తన లక్ష్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సమర్ధ నాయకుడైన నారా లోకేష్‌లే స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ కడియాల లలిత్ సాగర్ సతీమణి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ సైతం వైద్యరంగంలో అద్భుతమైన గుర్తింపును తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జిగా కూడా పనిచేస్తున్నారు. అవార్డు స్వీకరణలో డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌తో పాటు ఆయన సతీమణి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, కుమారులు కడియాల అక్షయ్ నంద, అభయ్ వర్ధన్ కూడా ఉన్నారు.

## ఘనంగా జీవనమూర్తి జెండా ఉత్సవం

**- బండలాగుడు పోటీలను ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి**



గిద్దలూరు, (చైతన్యరథం): రాచర్ల మండలం, అనుమలపల్లె గ్రామంలో శ్రీ జీవనమూర్తి స్వామి వారి జెండా మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో గిద్దలూరు నియోజకవర్గంలోని నలుమూలల నుండి భక్తులు పాల్గొనగా, ఆలయ ప్రాంగణంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, బండలాగుడు పోటీలను నిర్వహించారు. బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఐదేళ్ళకు ఒకసారి నిర్వహించే జీవనమూర్తి స్వామి వేడుకలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేలాదిమంది భక్తులు రావటం ఒక పండుగ వాతావరణాన్ని తలపిస్తుందని, ఈ వేడుకల్లో పాల్గొనటం స్వామి వారి భక్తునిగా తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, పార్లమెంట్ నాయకులు గోపిరెడ్డి జీవన్ రెడ్డి, జిల్లా నాయకులు కుప్పా రంగసాయి, స్థానిక నాయకులు సిరిగిరి వెంకటపతి, భూపని కాశయ్య, మాజీ ఎంపీపీ రెడ్డి కాశిరెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి, రాచర్ల మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ నేత మౌర్యరెడ్డి తిరుమల పాదయాత్ర

**- ప్రారంభించిన డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి**



సుండుపల్లె, (చైతన్యరథం): మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే తిరుమలకు పాదయాత్ర చేస్తానని మొక్కుకున్న టీడీపీ నేత మౌర్యరెడ్డి ఆ మేరకు సోమవారం తిమ్మసముద్రం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి గుడిలో రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మౌర్యరెడ్డి గతంలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే గోవిందమాల ధరించి సుండుపల్లె మండలం, తిమ్మసముద్రం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి పాదయాత్రగా తిరుమల శ్రీవారిని చేరుకుంటామని గతంలో ముక్కుకోవడం జరిగిందని దీంతో నేడు పాదయాత్రను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు.

# వైసీపీ అసమర్ధ పాలనకు సజీవ సాక్ష్యం

- ధ్వంసమైన ఇరిగేషన్ ప్రాజెక్టులు
- నీరు తెస్తామని ఉన్నవాటిని విరగ్గొట్టారు
- బాగు చేయించకుండా గాలికొదిలేశారు
- పేరూరు డ్యాం గేట్ల మరమ్మతులు ప్రారంభం
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధ్వజం





రాప్తాడు, (చైతన్యరథం) : సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ప్రభుత్వం అసమర్ధతకు పేరూరు జలాశయంలో విరిగిన గేట్లు సజీవ సాక్ష్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వర్షపు నీటితో జలాశయం నిండిన సమయంలో జాగ్రత్తలు తీసుకోకుండా గేట్లుఎత్తి వాటిని విరగ్గొట్టారన్నారు. ఆ తర్వాత వాటిని మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత పేరూరు జలాశయం గేట్లతో పాటు ఈ ప్రాజెక్టుకు నీరు అందించే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరులశాఖల మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం పేరూరు జలాశయం గేట్ల మరమ్మతులకు 1.21కోట్ల రూపాయలు మంజూరు చేసింది. గత వారం రోజులుగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే విరిగిన గేట్ల బాగాలను బయటకు తీశారు. వీటిని కర్నూలుకు తీసుకెళ్లి అక్కడ మరమ్మతులు చేయించనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. సోమవారం జలాశయం వద్దకు వెళ్లి మరమ్మతు పనులను పరిశీలించి ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేరూరు జలాశయంకు హంద్రీనీవా నీళ్లు తీసుకొస్తామని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ప్రగల్భాలు పలికారన్నారు. తీరా చూస్తే ఉన్న గేట్లను కూడా విరగ్గొట్టి పెట్టారన్నారు. అప్పట్లో వర్షానికి జలాశయంలోకి నీరు వచ్చిందని పట్టించు కోకపోవడంతో అది ఏరుపాలైందన్నారు. ఆ తర్వాత గేట్ల మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీని వలన జలాశయంలోకి నీరు వచ్చిన నిలబడని పరిస్థితి ఏర్పడిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జలాశయం గేట్ల మరమ్మతులు చేపట్టినట్టు వివరించారు. ఈ పనులు మూడు నెలల్లోపు పూర్తవుతాయన్నారు. హంద్రీనీవా గురించి, రైతుల ప్రయోజనాల గురించి ఆలోచిస్తున్నట్టుగా ప్రగల్భాలు పలికే ప్రకాష్ రెడ్డి తన హయాంలో గేట్లు విరగ్గొట్టి వాటికి ఎందుకు మరమ్మతులు చేయించలేదని ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేరూరుకు హంద్రీనీవా నీరు కూడా తీసుకొస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.



## విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, (చైతన్యరథం) : జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ పిల్లలకు ముఖ్యంగా కంటి చూపు లోపించడానికి కారణాలు ఎక్కువగా సెల్ ఫోన్ చూడడమేనన్నారు. పిల్లలు బయట ఆడుకున్న తర్వాత చేతులు శుభ్రపరుచుకోకుండా కళ్ళు నలుపుకోవడం వల్ల దుమ్ము, ధూళి చేరి కూడా కంటిచూపు సమస్యలు ఎక్కువగా రావచ్చన్నారు. పిల్లలందరికీ నేను ఒక మాట చెబుతూ మీ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకొని మీ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు.

పిల్లలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చదువుకోడానికి ఎన్నో అవకాశాలు ఇస్తోందన్నారు. అవన్నీ ఉపయోగించుకొని పిల్లలందరూ మంచి స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కంటిచూపునకు సంబంధించి ఆళ్లగడ్డ తాలూకాలో 11, 200 మందికి కంటి చూపు వైద్య పరీక్షలు చేయగా 514 మందికి ఈ అద్దాల పంపిణీ జరిగింది.

## జంతలూరు సెంట్రల్ యూనివర్సిటీ తీరుపై ఆరా


- సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శింగనమల, (చైతన్యరథం) : బుక్కరాయసముద్రం మండలంలోని జంతలూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో గత కొన్ని రోజులుగా విద్యార్థులు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం గురించి విద్యార్థులు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణతో కలిసి సెంట్రల్ యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఎల్లెల్సీ వాటాకు ఢోకా లేదు

- వేసవి నీటి ఎద్దడిని అధిగమిస్తాం
- మార్చి ఆఖరి వరకు పంట సాగు చేసుకోవచ్చు
- పట్టణ శివారు ప్రాంతాల్లో ఉచితంగా ఫిల్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భరోసా



ఎమ్మిగనూరు, (చైతన్యరథం) : వేసవిలో రైతాంగానికి, ఇటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మనకు రావాల్సిన ఎల్ఎల్సీ వాటా నిరాటంకంగా వస్తుందని దీని ద్వారా వేసవిలో ఎలాంటి నీటి సమస్య ఉండదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఎల్ఎల్సీ, జీఆర్పీ జీడీపీ, ఎంపీడీవో, ఈఓఆర్డీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్లో ఎల్ఎల్సీ ద్వారా ప్రస్తుతం 520 క్యూసెక్కులు నీరు వస్తోందని 600 క్యూసెక్కులు ఫ్లోటింగ్ వస్తే దాదాపు 13 రోజులపాటు 7 టీఎంసీల నీళ్లు వచ్చే విధంగా కార్యచరణ చేస్తున్నామని అన్నారు. ఆయకట్టు, నాన్-ఆయకట్టు రైతులకు పుష్కలంగా ఎల్ఎల్సీ ద్వారా వచ్చే నీరు మార్చి 31వ తేదీ వరకు పంటలు సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. రబీలో 7,500 ఎకరాలకు ఎల్ఎల్సీ ద్వారా నీటి విడుదల జరుగుతుందన్నారు. రైతులందరూ ఈ నీటిని వాడుకోవాలని సూచించారు. అలాగే పట్టణానికి గుడికల్ చెరువు ద్వారా, నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో తాగడానికి ఇబ్బందులు ఉండవని తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 8 గ్రామాల్లో తాగునీటి ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామన్నారు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఫిల్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలు ఉచితంగా నీరు అందిస్తామని తెలిపారు. వేసవిలో ఎలాంటి నీటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో పరిశుభ్రకు ప్రాధాన్యతిస్తామన్నారు. తడి పొడి చెత్తను సేకరించి సంపద సృష్టి జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం 9 నెలలోనే రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతిని కల్పించామన్నారు. నియోజకవర్గ ప్రజలందరికి వేసవిలో ఎలాంటి నీటి సమస్య ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలి

- వైసీపీ ప్రభుత్వ హయంలో పెట్రేగిపోయిన కబ్జాదారులు
- రెవెన్యూ అధికారుల సహకారంతో ఖాళీ స్థలాలు కనపడితే చాలు పాగా వేసేశారు
- పేదల ముసుగులో ప్రభుత్వ భూముల స్వాహా
- కదిరి భూ అక్రమాలపై నిగ్గు తేల్చాలి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చేతన్‌కి ఫిర్యాదు చేసిన టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్

కదిరి, (చైతన్యరథం) : వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారుల సహకారంతో ఖాళీ స్థలాలు కనపడితే చాలు కబ్జాలకు పాల్పడ్డారని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. కదిరి పొలంలోని సర్వే నెంబర్ 1781,83-1 ,469,470,472 లలో జరిగిన భూ అక్రమాలపై నిగ్గు తేల్చాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కొంతమంది స్వార్థపరులు పేదల ముసుగులో ప్రభుత్వ భూములను కబ్జా చేసి లక్షల రూపాయలకు అమ్మేశారన్నారు. గత ప్రభుత్వంలో భూకబ్జాదారులు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి సొమ్ము చేసుకున్నారన్నారు. భూ అక్రమాలపై విచారణ కమిటీని నియమించి కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విన్నవించినట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు.

## అక్కడికక్కడే సమస్యల పరిష్కారం


- గ్రీవెన్స్ సెల్‌కు సమస్యల వెల్లువ
- రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు



రాయదుర్గం, (చైతన్యరథం): పట్టణంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి కళ్యాణమండపంలో సోమవారం నిర్వహించిన రాయదుర్గం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అనేకమంది ఫిర్యాదుదారులు వేదిక వద్దకు వచ్చి తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. వెంటనే అందుబాటులో ఉన్న అధికారులతో వాటి పరిష్కారంపై చర్చించారు. మండల స్థాయి నుండి జిల్లా అధి,కారులు ఒకే వేదికపై ఉండటంతో కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం లభించింది.

# ఢిల్లీ, బీహార్‌లో భూ ప్రకంపనలు

- ఊగిపోయిన అపార్ట్‌మెంట్లు, విద్యుత్ స్తంభాలు
- రిక్టర్ స్కేల్‌పై 4.0 తీవ్రత




ఢిల్లీ: ఉత్తరభారతంలో సోమవారం తెల్లవారుజామున వరుస భూకంపాలు సంభవించాయి. తొలుత ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో భూ ప్రకంపనలు చోటుచేసుకున్న తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే బీహార్ రాష్ట్రంలో ఉదయం 8.02 గంటల ప్రాంతంలో ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సివాన్లో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపారు.

అంతకుముందు తెల్లవారుజామున 5.35 గంటల సమయంలో ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, గాజియాబాద్ ప్రాంతాల్లో 4.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. కొన్ని సెకన్ల పాటు భూమి తీవ్రంగా కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో భారీ శబ్దం కూడా వినిపించినట్లు కొందరు స్థానికులు చెబుతున్నారు. అపార్ట్‌మెంట్లు, విద్యుత్ స్తంభాలు ఊగిపోయాయని పేర్కొన్నారు. ధౌలా కాన్‌లోని దుర్గాబాయ్ దేశముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

**అప్రమత్తంగా ఉండాలి: ప్రధాని మోదీ**

దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా స్పందించారు. ఢిల్లీలో మళ్ళీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా చర్యలు పాటించాలని కోరారు.

**శబ్దాలకు కారణమేంటి?**

ప్రకంపనలు సంభవించిన సమయంలో కొన్ని సెకన్ల పాటు పెద్ద శబ్దం వినిపించింది. ఆ శబ్దానికి గల కారణాలను నిపుణులు వెల్లడించారు. తక్కువ లోతున ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ప్రకంపన సమయంలో ఈ బూమింగ్ శబ్దాలు వినిపిస్తుంటాయని తెలిపారు. ఆ సమయంలో భూమిపై ప్రకంపనలు రావడంతోపాటు, స్వల్పకాలం వచ్చిన భూతరంగాలు గాలిలో కలిసి ధ్వని తరంగాలుగా ఏర్పడతాయని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అధిక ఫ్రీక్వెన్సీ కంపనాల కారణంగా 'బూమ్' శబ్దం వస్తుందని పేర్కొంది. కొన్నిసార్లు కంపనాలు జరగకపోయినప్పటికీ.. ఈ భారీ శబ్దాలు వెలువడేందుకు అవకాశం ఉంది. భూకంప కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే.. అంత ఎక్కువగా శబ్దాలు వినిపిస్తాయి. సోమవారం ఢిల్లీ, బీహార్‌లో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు తక్కువ లోతులోనే.. 5 కి.మీ నుంచి 10 కి.మీ లోతులోనే ఉన్నాయి.

**సీస్మిక్ జోన్ 4లో ఢిల్లీ**

దేశాన్ని నాలుగు భూకంప మండలాలుగా విభజించారు. భూ కంప మండలం-2 అనేది రిక్టర్ స్కేల్‌పై 4.9 కన్నా తక్కువ తీవ్రత ఉండే ప్రాంతం. దేశ భూభాగంలో ఇది 40.93 శాతం. కర్ణాటక పీఠభూమి, ద్వీపకల్ప ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. మూడో మండలం 5-5.9 తీవ్రతను కలిగిఉంటుంది. ఇది దేశ విస్తీర్ణంలో 30.79 శాతం. పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, గోవా, లక్షద్వీప్ దీవులు ఇందులో ఉన్నాయి. భూకంప మండలం-4లో అధికస్థాయి భూకంపాలు (6- 6.9 తీవ్రత) వస్తాయి. దేశంలో 17.49శాతం భూభాగం ఇటువంటిదే. ఇందులో జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, సిక్కిం, ఉత్తరప్రదేశలోని ఉత్తర ప్రాంతాలు, బీహార్, పశ్చిమ్ బెంగాల్, మహారాష్ట్ర పశ్చిమ తీరం, రాజస్థాన్ ఉన్నాయి. మండలం-5 లో 7 కన్నా ఎక్కువ తీవ్రతతో భూకంపాలు సంభవిస్తాయి. 10.79శాతం భూభాగంలో ఇలాంటివి చోటుచేసుకునే ప్రమాదముంది. దీని పరిధిలో ఉత్తర బీహార్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్లోని రాన్-ఆఫ్-కచ్, అండమాన్-నికోబార్ దీవులున్నాయి.

**అందుకే హిమాలయాల్లో ఎక్కువ..**

సహజంగా శక్తి విడుదలైనప్పుడు భూమి కంపిస్తుంది. ఆ సమయంలో భూకంప కేంద్రం నుంచి అన్ని దిశల్లోనూ తరంగాలు ప్రయాణిస్తాయి. భూఫలకలు మానవ స్పర్శకు తెలియని స్థాయిలో నిరంతరం కదులుతూనే ఉంటాయి. అయితే, ఆ సమయంలో భూమి పొరలు బలహీనంగా ఉన్నచోట్ల ఒక్కోసారి కంపనాలు సంభవిస్తాయి. భూఫలకల అంచుల చుట్టూ తరచూ భూకంపాలు చోటుచేసుకుంటాయి. ఉదాహరణకు, భారతదేశ భూఫలక ఉత్తర దిశగా, ఈశాన్యం వైపు కదులుతూ ఉంటుంది. ఈ ఫలక సంవత్సరానికి 5సెం.మీ. చొప్పున కదులుతుంది. భారతదేశానికి పైభాగంలో ఉన్న యురేషియన్ భూఫలక ఉత్తర దిశగా ఏడాదికి 2 సెం.మీ. చొప్పున కదులుతోంది. ఈ రెండు ఫలకల కదలికల్లో తేడాలు ఉండటం వల్ల భారత భూఫలక యురేషియన్ ఫలకను ఢీకొడుతోంది. అందుకే హిమాలయాల ప్రాంతాల్లో తీవ్ర భూకంపాలు వస్తున్నాయి.

## క్రూర మృగాలు పాములు, మొసళ్లు దాటుకుంటూ..!

- రోజుల తరబడి ఆహారం లేకుండా అడవుల్లో నడక
- అమెరికా 'డంకీ' మార్గంలో అభాగ్యుల అష్టకష్టాలు



అమృత్‌సర్: రోజుల తరబడి ఆహారం లేకుండా ప్రమాదకరమైన అడవుల్లో, చిత్తడి నేలల్లో నడక. దారిలో క్రూర మృగాలు, పాములు, మొసళ్లను దాటుకుంటూ సాగే ప్రయాణం. ఇవికాక అటవీ ప్రాంతాల్లో తారసపడే నరహంతక సాయుధ ముఠాలు. ప్రాణాలకు తెగించి జరిపే ఈ ప్రయాణమంతా అక్రమంగా అమెరికా చేరుకుని అక్కడ ఏదో పనిచేసుకుని డాలర్లు సంపాదించాలనే ఆశతోనే. అయితే ఏజెంట్ల చేతిలో లక్షలకు లక్షలు మోసపోయిన వారి ఆశలు నెరవేరకపోగా, అత్యంత అమానవీయ పరిస్థితుల్లో స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చీరాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి మరీ వారిని తిప్పి పంపిస్తున్నారు. అలా వందల మంది భారతీయులను కూడా స్వదేశానికి పంపించారు. ఈ పరిణామాల వేళ అమెరికా వెళ్లే అక్రమ మార్గమైన 'డంకీ' రూట్ గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎంతోమంది వలసదారులు ప్రాణాలకు తెగించి ఈ మార్గంలో అగ్రరాజ్యానికి వెళ్తున్నారు. తాజాగా స్వదేశానికి చేరుకున్న ఓ యువకుడు డంకీ రూట్లో తాను ఎదుర్కొన్న భయానక అనుభవాలను వివరించాడు. పాములు, మొసళ్లను దాటుకుని తాను చేసిన ప్రయాణాన్ని తలచుకుని ఉద్వేగానికి లోనయ్యాడు.

మూడో విడతలో భాగంగా 112 మంది భారతీయులు ఆదివారం రాత్రి 10 గంటలకు అమెరికా సైనిక విమానంలో అమృత్‌సర్ చేరుకున్నారు. ఇందులో వచ్చిన పంజాబీ వాసి మన్‌దీప్ సింగ్ తన అనుభవాలను పంచుకున్నాడు. అమెరికా వెళ్లడానికి తాను ఓ ఏజెన్సీని సంప్రదించగా చట్టపరంగా తీసుకెళ్తానని నమ్మించి రూ. 40లక్షలు వసూలు చేశారని వాపోయాడు. తర్వాత వారు చెప్పినట్లుగా కాకుండా ట్రావెల్ ఏజెంట్ తనను ప్రమాదకరమైన డంకీ మార్గంలో తీసుకువెళ్లాడని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

మొదట అమృత్‌సర్ నుంచి విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లి.. అక్కడి నుంచి ముంబయి, నైరోబీ, ఆమ్‌స్టర్ డాం మీదుగా సురినామ్ చేరుకున్నట్లు వివరించాడు. అక్కడి నుంచి ఓ చిన్న, ఇరుకైన వాహనంలో తనలాంటి మరికొంతమందిని ఎక్కించి గయానాకు తీసుకెళ్లారన్నాడు. ఆ మార్గంలో రోజుల తరబడి ఆహారం లేకుండా.. పనామా అడవుల్లో, కాలువల్లో ప్రమాదకర పాములు, మొసళ్లను దాటుకుంటూ తమ ప్రయాణం సాగిందని పేర్కొన్నాడు. దీని గురించి ప్రశ్నిస్తే చంపేస్తామని ఏజెంట్ బెదిరించారన్నాడు. అలా రోజుకు 12 గంటలు నడుస్తూనే ఉండేవాళ్లమని తెలిపాడు. కెన్యా. నెదర్లాండ్స్, గయానా, సురినామ్, కొలంబియా, పనామా. నికరగ్వా దేశాల మీదుగా అమెరికా చేరుకున్నట్లు తెలుపుతూ... ప్రయాణానికి సంబంధించిన పలు వీడియోలను చూపించాడు.

అలా ఎన్నో కష్టాలను దాటుకుని ఈ ఏడాది జనవరి 27న మెక్సికోలోని టిజువానాకు చేరుకొన్నామన్నాడు. అక్కడి నుంచి అమెరికాలోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో సరిహద్దు భద్రతా దళ అధికారులు తనను అరెస్ట్ చేశారని తెలిపాడు. అనంతరం విమానంలో తిప్పి పంపినట్లు చెప్పాడు. దీంతో అగ్రరాజ్యంలో స్థిరపడి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాను కన్న కలలు పేక మేడల్లా కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

## పేపర్ లీక్ వదంతులపై సీబీఎస్ఈ సీరియస్

- వదంతులు వ్యాప్తిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక




ఢిల్లీ: పేపర్ లీక్ జరిగిందంటూ వస్తోన్న వదంతులపై సీబీఎస్ఈ తీవ్రంగా స్పందించింది. అదంతా అసత్య ప్రచారమంటూ కొట్టిపారేసింది. ఫిబ్రవరి 15 నుంచి సీబీఎస్ఈ బోర్డు 10, 12వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. 8వేల పాఠశాలలకు చెందిన సుమారు 44 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. కొన్ని అసాంఘిక శక్తులు పేపర్ లీక్ గురించి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, తదితర సోషల్ మీడియా వేదికల్లో చేస్తోన్న ప్రచారం బోర్డు దృష్టికి వచ్చింది. అవన్నీ నిరాధారమైనవి. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తించే ఉద్దేశంతో కొందరు వీటిని వ్యాప్తి చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై దర్యాప్తు సంస్థలు విచారణ చేపడుతున్నాయి. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తప్పవని సీబీఎస్ఈ బోర్డు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంలో విద్యార్థులు దోషులుగా తేలితే.. ప్రస్తుత ఏడాదితో పాటు మరో మూడేళ్లపాటు ఎలాంటి పరీక్షలు రాయడానికి వీలు ఉండదని హెచ్చరించింది.

ఇలాంటి అసత్య ప్రచారం కట్టడి కోసం సీబీఎస్ఈ ఇటీవల ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. కచ్చితమైన సమాచారం కోసం సీబీఎస్ఈ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే వీక్షించాలని సూచించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత, సీసీటీవీల పర్యవేక్షణలో బోర్డు ఈ పరీక్షలు నిర్వహిస్తోంది.

## చైనాను శత్రువులా చూడొద్దు

**శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు - అది వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ వివరణ**



ఢిల్లీ: కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా తన వివాదాస్పద వ్యాఖ్యలతో సొంత పార్టీని తరచూ ఇరకాటంలో పెడుతుంటారు. తాజాగా చైనాపై కాంగ్రెస్ పార్టీ వైఖరికి భిన్నమైన వాదనలు వినిపించారు. చైనాను భారత దేశం శత్రువులా చూడొద్దని శామ్ పిట్రోడా అన్నారు. ఆ దేశాన్ని గుర్తించి, గౌరవించాల్సిన సమయం ఆసన్నమైందని.. ఇకనైనా భారత్ తన వైఖరి మార్చుకొని చైనాను శత్రువులా చూడరాదని సూచించారు. తొలినుంచి చైనాతో భారత్ అనుసరిస్తున్న ఘర్షణాత్మక వైఖరి ఇరుదేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచుతోందని శామ్ పిట్రోడా తాజాగాఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. అమెరికా చైనాను తరచూ శత్రువుగా పేర్కొంటూ.. భారత్‌కు కూడా అదే అలవాటు చేస్తోంది. అభివృద్ధిలో వెనకబడి ఉన్న దేశాలు వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. పేద దేశాలు మరింత వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. మరోవైపు అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధి రేటు నెమ్మదిస్తోంది. ఇలాంటి దేశాల్లో వృద్ధాప్య జనాభా ఎక్కువగా ఉంటోంది. ఇక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువతరం ఎక్కువగా ఉంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మనం ప్రవర్తించాలి" అని పిట్రోడా అన్నారు.

తమ పార్టీ నేత శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై తాజాగా కాంగ్రెస్ స్పందించింది. చైనా విషయంలో పిట్రోడా వ్యక్తంచేసింది పార్టీ అభిప్రాయం కాదు. ఆయన మాటలు వ్యక్తిగతం. అవి కాంగ్రెస్ వైఖరిని ప్రతిబింబించడం లేదు. విదేశాంగ విధానం, భద్రత, ఆర్థికపరంగా చైనా ఇప్పటికీ సవాలుగానే ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వివరణ ఇచ్చుకున్నారు.

## లాడెన్‌ను లేపేసిన ఓనీల్..
# గంజాయి బిజినెస్‌లో బిజీ!



ప్రపంచంలోనే కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా నేత ఒసామా బిన్‌లాడెన్‌ను కాల్చిచంపిన అమెరికా నేవీ సీల్ కమాండో ఇప్పుడేం చేస్తున్నాడో తెలుసా..? గంజాయి వ్యాపారం..! అదీ అమెరికా మెట్రో నగరమైన న్యూయార్క్ కావడం గమనార్హం. అది కూడా సమాజసేవ కోసమని అతడు చెప్పడం మరో విశేషం.

పాకిస్థాన్‌లో నక్కిన ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడానికి నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పర్యవేక్షణలో సీల్స్ బృందం ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్ను నిర్వహించింది. ఈ సందర్భంగా లాడెన్ ఉన్న గదిలోకి ప్రవేశించిన కమాండో రాబర్ట్ ఓనీల్ అతడిని కాల్చి చంపాడు. కొన్నాళ్లపాటు అతడి పేరు గోప్యంగా ఉన్నా.. తర్వాత ప్రపంచానికి తెలిసిపోయింది. ప్రస్తుతం అతడి వయసు 48 ఏళ్లు. న్యూయార్క్ నగరంలో ప్రభుత్వ లైసెన్స్‌తో గంజాయి విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నాడు. 'ఆపరేటర్ కన్నా కో' పేరిట తన బ్రాండ్ విక్రయాలు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సందర్భంగా ఓనీల్ మాట్లాడుతూ "సైన్యంలో ఉన్న అనుభవం, మాజీ సైనికులు తీవ్రమైన పోస్ట్ ట్రామా స్ట్రెస్ డిజార్డర్‌తో బాధపడటం చూసి ఈ వ్యాపారంలోకి రావాలని నిశ్చయించుకొన్నా" అని న్యూయార్క్ పోస్ట్ పత్రికకు వెల్లడించాడు. తన వ్యాపారం నుంచి వచ్చే అధిక ఆదాయాన్ని వికలాంగులైన మాజీ సైనికుల కోసం ఛారిటబుల్ ట్రస్టుకు దానం చేస్తానన్నాడు. అమెరికాలో 9/11 దాడుల మాస్టర్‌మైండ్‌ను తానే కాల్చినట్లు వెల్లడించడంతో సీల్ టీమ్ సభ్యుడు ఓనీల్ పేరు ఫేమస్ అయింది.

పాక్‌లోని అబోట్టాబాద్ మిలిటరీ కంటోన్మెంట్ శివారులోని ఓ సురక్షిత ప్రాంతంలో అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్‌లాడెన్ దాక్కున్నట్లు అమెరికాకు 2011లో స్పష్టమైన సమాచారం వచ్చింది. అతడిపై దాడి చేసేందుకు 'ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్కు' నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లలో పాక్ రాడార్ సిగ్నల్స్‌ను తప్పించుకొని వెళ్లిన 79మంది కమాండోలు, ఓ కుక్క.. లాడెన్ ఇంటిని చుట్టుముట్టి దాడి చేశారు. ఈక్రమం లో ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఆ ఇంటి పైనగదిలో ఉన్న లాడెన్‌ను హతమార్చిన కమాండోలు.. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం అతడి మృతదేహాన్ని సముద్రంలో ఖననం చేశారు.

## ఉద్రిక్తతలకు అమెరికా-రష్యా తెర?



అమెరికా– రష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలకాలని వ్లాదిమిర్ పుతిన్, డొనాల్డ్ ట్రంప్‌లు కోరుకుంటున్నారని రష్యా వెల్లడించింది. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. అమెరికా– రష్యాల మధ్య సంబంధాల పునరుద్ధరణ, ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం తదితర అంశాలపై సౌదీ అరేబియా వేదికగా ఇరు దేశాల నేతలు భేటీ కానున్న నేపథ్యంలో లావ్రోవ్ ఈ విధంగా స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఫోన్లో మాట్లాడిన విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య క్షీణించిన సంబంధాలపై వారు మాట్లాడారని, వాటి పునరుద్ధరణ కోసం ఇరు దేశాధ్యక్షులు చర్చలు జరిపేందుకు అంగీకరించారని చెప్పారు.

**శాంతి చర్చల్లో జెలెన్‌స్కీ**

ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అమెరికా– రష్యా మధ్య సంబంధాలు ఊహించని స్థాయిలో పతనమైన విషయం తెలిసిందే. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత ఉక్రెయిన్ యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడితోనూ చర్చలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడిన ఆయన.. సౌదీ అరేబియాలో శాంతి చర్చలుంటాయని చెప్పారు. ఇందులో ట్రంప్ పుతిన్లు నేరుగా సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఇప్పటికే యూఏఈ చేరుకొన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కూడా శాంతి చర్చల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## అబద్ధాల ఎంపీకి పార్లమెంట్‌లో ఫైన్




సింగపూర్‌లోని భారత సంతతి నేత ప్రీతమ్ సింగ్‌కు ఓ కేసులో చుక్కెదురైంది. ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయనపై.. పార్లమెంటులో అబద్ధాలు చెప్పారనే అభియోగాలు రుజువయ్యాయి. దీంతో 14వేల డాలర్ల జరిమానా విధిస్తూ స్థానిక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, శిక్షతో పార్లమెంటు సభ్యుడిగా అనర్హత వేటు పడే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.


భారత సంతతికి చెందిన ప్రీతమ్ సింగ్.. సింగపూర్ వర్కర్స్ పార్టీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అయితే, ఆ పార్టీకి చెందిన మాజీ సభ్యురాలు రయీసా ఖాన్‌పై 2021లో పార్లమెంటులో అబద్ధం చెప్పారనే ఆరోపణలు రావడంతో ప్రివిలేజెస్ కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ ముందు విచారణకు హాజరైన ప్రీతమ్ సింగ్, రెండు సందర్భాల్లో తప్పుడు వాంగ్మూలం ఇచ్చారనే అభియోగాలు వచ్చాయి. దీనిపై నాలుగు నెలల క్రితం విచారణ మొదలైంది. రెండు అభియోగాల్లో ప్రీతమ్‌పై నేరం రుజువు కావడంతో ఒక్కో కేసులో గరిష్ఠంగా 7వేల సింగపూర్ డాలర్ల జరిమానా విధిస్తూ స్థానిక న్యాయస్థానం తీర్పు చెప్పింది. అయితే, సింగపూర్ రాజ్యాంగం ప్రకారం.. ఏదైనా కేసులో ఎంపీకి కనీసం ఏడాది జైలుశిక్ష లేదా 10వేల సింగపూర్ డాలర్ల జరిమానా పడితే పార్లమెంటు సభ్యత్వం కోల్పోతారు. కానీ, ప్రీతమ్‌కు గరిష్ఠంగా 7వేల డాలర్లు పడటం, జరిమానా గరిష్ఠ పరిమితి తక్కువగా ఉండటంతో ఆయన ఎంపీ సభ్యత్వానికి ఎటువంటి ప్రమాదం లేదని ఎన్నికల విభాగం వెల్లడించింది. ఒక కేసులో పడిన గరిష్ఠ జరిమానాను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. తీర్పు వెలువడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రీతమ్ సింగ్.. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

## అవసరమైతే ఉక్రెయిన్‌కు మా బలగాలు



రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే తమ బలగాలను ఉక్రెయిన్‌కు పంపడానికి సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. బ్రిటన్, ఐరోపా భద్రత దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకునేందుకు యోచిస్తున్నామన్నారు. ఈవిషయంపై బాగా ఆలోచించిన అనంతరం తమ బలగాలను ఉక్రెయిన్‌కు మద్దతుగా పంపాలనుకున్నామని తెలిపారు. ఆ దేశానికి తాము సహాయం చేస్తున్నామంటే దానికి కారణం తమ పౌరులను కూడా రక్షించుకోవాలనే ఉద్దేశం మాత్రమేనన్నారు. ఉక్రెయిన్‌కు సహాయం చేయడం తమ బాధ్యతన్నారు. పారిస్ వేదికగా జరిగిన ఓ సమావేశంలో యుద్ధం విషయంలో అమెరికా అవలంభిస్తున్న విధానాలపై చర్చించడానికి ముందు కీర్ స్టార్మర్ ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలుస్తానని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. "ఐరోపా, అమెరికాల మధ్య బంధాలు బలపడడంలో బ్రిటన్ కీలక పాత్ర పోషిస్తుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంలో అమెరికా మద్దతు చాలా అవసరం. పుతిన్ ఉక్రెయిన్‌పై మరో దాడి చేయకుండా అడ్డుకునే సామర్థ్యం ట్రంప్‌కు మాత్రమే ఉంది" అన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసి ఫిబ్రవరి 24కు మూడేళ్లు పూర్తవుతుండడంతో దానికి ముందు జర్మనీ, యునైటెడ్ కింగ్ డమ్, ఇటలీ, పోలాండ్, స్పెయిన్, నెదర్లాండ్స్, డెన్మార్క్ ప్రభుత్వాధినేతలు సమావేశమవ్వనున్నట్లు సమాచారం. ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ మాట్లాడుతూ.. యూరోపియన్ యూనియన్‌కు సైనిక కూటమిని ఏర్పాటుచేసుకునే సమయం వచ్చిందన్నారు. యుద్ధాన్ని ముగించడానికి రష్యా ఆసక్తి చూపట్లేదని అసహనం వ్యక్తంచేశారు. అమెరికా సైనిక సాయం చేయకుండా తమ దేశం మనుగడ సాగించడం అసాధ్యమని.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రదేశం తమకు సైనిక సహాయాన్ని ఆపివేసినా ఆశ్చర్యపోనక్కరలేదని వ్యాఖ్యానించారు. ఎటువంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవడానికి యూరోపియన్ దేశాలు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. దీంతో ఈయూ దేశాలు అప్రమత్తమయ్యాయి.

## ద డెటోన-500 రేస్‌లో 'బీస్ట్'!



జనాలను ఉత్సాహపర్చడంలో అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌ను మించిన మాస్ లీడర్ లేరనే చెప్పాలి. తాజాగా అలాంటి ఘటనే చోటుచేసుకొంది. తన సొంత రాష్ట్రమైన ఫ్లోరిడాలో ప్రతిష్ఠాత్మకంగా మొదలైన 'ది డెటోన–500' మోటార్ రేసు ప్రారంభానికి ఏకంగా అధ్యక్షుడు మోటార్ కేడ్లో వాడే తన కారు 'ది బీస్ట్' ను కూడా పంపారు. అది ప్రేక్షకులను ఉత్సాహపరుస్తూ రెండు ల్యాపును కూడా పూర్తి చేసింది. ఆ సమయంలో ట్రంప్ తన మనమరాలు కరోలినాతో కలిసి అందులో ఉన్నట్లు శ్వేతసౌధం విడుదల చేసిన వీడియోను బట్టి తెలుస్తోంది. అంతేకాదు.. అధ్యక్షుడి విమానం ఎయిర్ ఫోర్స్ వన్ కూడా ది డెటోన–500 మైదానం చుట్టూ ఓ రౌండ్ వేసింది. ఈసందర్భంగా ట్రంప్ తన సందేశంలో "ది డెటోన–500' రేసు అంటే జీవితంలో వేగం అంటే మక్కువ. అడ్రెనలిన్ ఉప్పొంగించే దూకుడు, రేసింగ్‌లోని థ్రిల్‌ను ప్రేమించేవారిని ఒక్కచోటుకు చేర్చింది. రేసింగ్ ట్రాక్‌పై ఇంజిన్ల గర్జన, స్టాండ్లతో ఎగిరే పతాకాలు వేగం, శక్తి, ది మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌కు ఈ రేసు ఇచ్చే గౌరవం" అని పేర్కొన్నారు.

ట్రంప్ వెస్ట్ పామ్ బీచ్‌నుంచి ఈ రేసుకు తరలివచ్చారు. ఈ క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఫోర్స్ వన్ రేస్ ట్రాక్ చుట్టూ ఓ ప్రదక్షిణ చేసి ప్రేక్షకులను ఉత్సాహపర్చింది. ఆయనతోపాటు కుమారుడు ఎరిక్, మనవడు లూకె, రవాణ మంత్రి సియాన్ డఫ్ఫీ, ఇంటీరియర్ సెక్రటరీ డౌగ్ బుర్గమ్‌వంటి వారున్నారు. దీంతోపాటు పలువురు కాంగ్రెస్ సభ్యులు కూడా ట్రంప్‌తోపాటు ప్రయాణించారు. ఆ తర్వాత అధ్యక్షుడి కార్ల కాన్వాయ్ రేస్ ట్రాక్‌పై రెండు ల్యాప్లు పూర్తి చేసింది. అమెరికాలోని నాస్కర్ (నేషనల్ అసోసియేషన్ ఫర్ స్టాక్ కార్ ఆటో రేసింగ్)లో ది డెటోన–500 అత్యంత ప్రతిష్ఠాత్మకమైంది. తాను అధ్యక్ష రేసులో రెండోసారి పోటీపడుతున్న 2020 సమయంలో కూడా ట్రంప్ దీనిని వీక్షించేందుకు స్వయంగా వచ్చారు.



## కెంటకీని ముంచిన మెరుపు వరద

అమెరికాలోని కెంటకీలో వచ్చిన మెరుపు వరదల్లో మృతుల సంఖ్య 8కి చేరింది. అక్కడి ఒబియాన్ నదికి సంరక్షణగా నిర్మించిన కట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా సమీప ప్రాంతాలు జలమయ్యాయని ఒబియాన్ కౌంటీ మేయర్ వెల్లడించారు. ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. దీంతోపాటు ఆ ప్రాంతంలో విపత్తు సంభవించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతోపాటు ఫెడరల్ సహాయాన్ని కూడా ఆయన కేటాయించారు. ఆదివారం వచ్చిన వరద నుంచి వందల మందిని రక్షించినట్లు రాష్ట్ర గవర్నర్ ఆండీ బెషీర్ వెల్లడించారు. ఈ సంఖ్య 1,000 వరకు ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో చాలాచోట్ల రోడ్లు మునిగిపోయాయి. కెంటకీలోని రివర్ మెడికల్ సెంటర్ ప్రాంతానికి కూడా వరద నీరు చొచ్చుకురావడంతో చాలామంది పేషెంట్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. 39,000 ఇళ్లల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. బలమైన గాలులు వీస్తుండటంతో మరిన్ని ప్రాంతాల్లో కరెంటు నిలిచిపోవచ్చని భావిస్తున్నారు.

ఇక అమెరికా ఉత్తర ప్రాంతంలో ప్రాణాలు తోడేసేంత చలి ఉంది. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ అయ్యాయి. అట్లాంటాలో చెట్టు విరిగి ఇంటిపై పడటంతో ఒక వ్యక్తి మరణించారు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల కారణంగా నార్త్, సౌత్ డకోటా, మిన్నెసోటాలోని కొన్నిచోట్ల –45.6 డిగ్రీల సెంటీగ్రేడుకు ఉష్ణోగ్రత పడిపోయింది.

## మరి కొన్ని గంటల్లో ఛాంపియన్స్ ట్రోఫీ..

# కనిపించని భారత్ జెండా



ప్రారంభం కాకముందే మరో వివాదం. మరో కొన్ని గంటల వ్యవధిలో ఆతిథ్య పాకిస్థాన్‌లో కరాచీ మైదానంలో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జరగనుంది. ఇంతలోనే పాకిస్థాన్ మరోసారి తన బుద్ధిని చూపించింది. భారత జట్టును దారుణంగా అవమానించింది. భారత్‌పై పీసీబీ తన అక్కసు వెళ్లగక్కింది.

టీమిండియా ఆటగాళ్ల భద్రతను కారణంగా చూపిస్తూ పాకిస్థాన్‌లో పర్యటించేందుకు బీసీసీఐ అభ్యంతరం చెప్పిన విషయం తెలిసిందే. దాంతో ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా పీసీబీని ఐసీసీ ఒప్పించింది.

ఇందుకుగానూ బీసీసీఐ-పీసీబీల మధ్య ఓ ఒప్పందం జరిగింది. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని పీసీబీ కోరగా.. అందుకు బీసీసీఐ అంగీకరించింది. అంతేకాకుండా నష్టపరిహారంగా పీసీబీకి ఐసీసీ.. ఓ మెగా టోర్నీని కూడా కేటాయించింది. టోర్నీ నిర్వహణ బడ్జెట్ కూడా పెంచింది. దాంతో భారత్ మ్యాచ్‌లను దుబాయ్ వేదికగా నిర్వహించేందుకు పీసీబీ ఒప్పుకుంది.

కనిపించని భారత జెండా..

ఇంత చేసినా భారత్‌పై పీసీబీ తన అక్కసు వెళ్లగక్కింది. మరో రెండు రోజుల్లో ఈ టోర్నీకి తెరలేవనుండగా.. కరాచీ స్టేడియంలో చోటు చేసుకున్న ఓ ఘటన భారత అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. ఈ స్టేడియంలో అన్ని జట్ల జాతీయ జెండాలను ప్రదర్శించిన పీసీబీ.. భారత దేశ పతాకాన్ని మాత్రం పక్కనపెట్టింది. తమ దేశంలో పర్యటించడం లేదనే సాకుతోనే భారత జెండా ప్రదర్శించకుండా పీసీబీ ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేసినట్లు అర్థమవుతోంది.

**కక్ష సాధింపు..**

ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. భారత అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాకిస్థాన్ తమ నీచ బుద్ధిని బయటపెట్టుకుందని, వెంటనే ఐసీసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భారత జెండాను ప్రదర్శించకపోతే.. టోర్నీని బహిష్కరించాలని కూడా బీసీసీఐకి సూచిస్తున్నారు. భారత్ జెండా ప్రదర్శన చేయకపోవడానికి గల కారణాలను పీసీబీ అధికారికంగా ప్రకటించలేదు. కానీ ఆ దేశ జర్నలిస్ట్‌లు, నెటిజన్లు మాత్రం.. ఇది ప్రతీకార చర్యగానే పేర్కొంటున్నారు. కరాచీ స్టేడియం వేదికగా న్యూజిలాండ్, సౌతాఫ్రికా,ఆఫ్గనిస్థాన్, పాకిస్థాన్, ఇంగ్లండ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. గడాఫీ స్టేడియంలోనూ భారత జెండాను ప్రదర్శించలేదు.

**భారత ఆటగాళ్లను హగ్ చేసుకోవద్దు..**

పాకిస్థాన్‌లో పర్యటించేందుకు విముఖత చూపించిన భారత ఆటగాళ్లను హగ్ చేసుకోవద్దని పాకిస్థాన్ ప్లేయర్లకు ఆ దేశ అభిమానులు సూచించారు. ఫిబ్రవరి 23న దాయాదీ దేశాలు భారత్-పాక్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ఇంకా వారం రోజుల సమయం ఉన్నా.. అప్పుడే హైప్ క్రియేట్ అయ్యింది. అప్పుడే ఇరు దేశాల అభిమానులు సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తిపోస్తున్నారు.



ఛాంపియన్స్ ట్రోఫీ భారత్‌దే..

## టాప్ స్కోర్‌గా రోహిత్ శర్మ

**- ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ క్లార్క్**

ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమిండియా నిలుస్తుందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ జోస్యం చెప్పాడు. అలాగే భారత కెప్టెన్ రోహిత్ శర్మ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలుస్తాడని క్లార్క్ వ్యాఖ్యానించాడు. ఒక్కసారి అతడు కుదురుకుంటే ఆపడం ఎవరి వల్లా కాదని.. తాజాగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఫామ్ అందుకోవడం టీన్‌ఇండియాకు కలిసొచ్చే అంశమని స్పష్టం చేశాడు.

"భారతే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలవబోతుందని చెబుతున్నా. సారథి రోహిత్ శర్మ మళ్లీ ఫామ్లోకి రావడం బాగుంది. అందుకే, టీమ్ ఇండియా టైటిల్ను సొంతం చేసుకోగలదని భావిస్తున్నా. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించే బ్యాటర్గానూ నిలుస్తాడు. ఇక టాప్ వికెట్ టేకర్ జోఫ్రా ఆర్చర్ అవుతాడనుకుంటున్నా. జట్టుపరంగా ఇంగ్లండ్‌కు టైటిల్ అవకాశాలు తక్కువే. కానీ, ఆ జట్టులో అతడే సూపర్ స్టార్. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ట్రావిస్ హెడ్ నిలుస్తాడనుకుంటున్నా. ఐపీఎల్ ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నా. గత వన్డే ప్రపంచ కప్లోనూ కీలక ఇన్నింగ్స్‌ను ఆడాడు" అని క్లార్క్ వెల్లడించాడు.

గేల్ రికార్డుపై విరాట్ గురి

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగుతోన్న విరాట్ కోహ్లి ముంగిట ఓ రికార్డు ఉంది. అదీనూ యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ రికార్డు కావడం గమనార్హం. ఇప్పటి వరకు ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో విరాట్ కోహ్లి 13 మ్యాచుల్లో 529 పరుగులు చేశాడు. కెరీర్ లో ఇదే చివరి ఛాంపియన్స్ ట్రోఫీగా భావిస్తోన్న విరాట్ మరో 263 పరుగులు చేస్తే.. టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్గా అవతరిస్తాడు. ప్రస్తుతం క్రిస్ గేల్ (791) అందరికంటే ముందున్నాడు. ఈ జాబితాలో శిఖర్ ధావన్ (701) మూడో స్థానంలో ఉన్నాడు. ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్ తన తొలి మ్యాచ్‌లో ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఫిబ్రవరి 23న పాక్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.

డబ్ల్యూపీఎల్ 2025..

రఫ్ఫాడించిన రేణుక సింగ్, జార్జియా..

# కుప్పకూలిన ఢిల్లీ!




వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2025 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించి సంచలన విజయాన్నందుకున్న ఆర్‌సీబీ.. రెండో మ్యాచ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆర్‌సీబీ బౌలర్లు రేణుక సింగ్(3/23), జార్జియ వేర్హమ్(3/25) రఫ్ఫాడించారు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 19.3 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. జెమీమా రోడ్రిగ్స్(22 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34) టాప్ స్కోరర్లుగా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. రేణుక, జార్జియతో పాటు కిమ్ గార్త్, ఎక్ట్ బిష్ట్ రెండేసి వికెట్లు పడగొట్టారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆదిలో గట్టి షాక్ తగిలింది. ఓపెనర్ షెఫాలీ వర్మ(0)ను రేణుక సింగ్ గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చింది. మరో ఓపెనర్ కెప్టెన్ మెగ్ లాన్నింగ్‌తో కలిసి జెమీమాతో దూకుడుగా ఆడింది. మెగ్ లాన్నింగ్ కూడా బౌండరీలు బాదడంతో పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఢిల్లీ 55 పరుగులు చేసింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని రేణుక విడదీసింది.

జెమీమాను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి రెండో వికెట్‌కు నమోదైన 59 పరుగుల భాగస్వామ్యానికి తెరదించింది.

సదర్లాండ్ ఆచితూచి ఆడగా.. మెగ్ లాన్నింగ్‌ను కిమ్ గార్త్ పెవిలియన్ చేర్చింది. సదర్లాండ్(19)ను రేణుక ఔట్ చేయగా.. జెస్ జోనాస్సెన్(0) బిష్ట్ పెవిలియన్ చేర్చింది. మరిజన్నే కాప్, సారా బ్రైస్, రాధా యాదవ్, తెలుగు తేజం అరుంధతి రెడ్డి(4)లు తీవ్రంగా నిరాశపర్చడంతో ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది.

# మళ్లీ బ్యాట్ పట్టిన సచిన్..

**- ట్రేడ్ మార్క్ షాట్స్‌తో దుమ్మురేపుతున్న మాస్టర్..!**



క్రికెట్ గాడ్, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మళ్లీ బ్యాట్ పట్టాడు. తనకే సాధ్యమైన స్ట్రైట్ డ్రైవ్ ట్రేడ్ మార్క్ షాట్స్‌తో బౌలర్లకు చుక్కలు చూపించాడు. ప్రస్తుతం సచిన్ టెండూల్కర్ బ్యాటింగ్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'ది గోట్ ఈజ్ బ్యాక్.. సచిన్ బ్యాటింగ్ చూసేందుకు ఆతృతగా ఉన్నాం'అని కామెంట్ చేస్తున్నారు.

ప్రస్తుతం సచిన్ టెండూల్కర్ ఇంటర్నేషనల్ మాస్టర్ లీగ్(ఐఎమ్ఎల్) టీ20 టోర్నీ కోసం సన్నద్ధమవుతున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీ కోసం నెట్స్‌లో చెమటోడ్చుస్తున్నాడు. సచిన్ బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు సంబంధించిన వీడియోను నిర్వాహకులు సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. అలనాటి ఆటగాళ్లతో ఈ టోర్నీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

ఫిబ్రవరి 22 నుంచి మార్చి 16 వరకు నవీ ముంబై, రాయ్‌పూర్ వేదికగా మ్యాచ్‌లు జరగనున్నాయి. మొత్తం 6 జట్లు ఈ టోర్నీ బరిలో నిలవగా.. ప్రతీ జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడనుంది. ఇండియా మాస్టర్స్, శ్రీలంక మాస్టర్స్, వెస్టిండీస్ మాస్టర్స్, ఆస్ట్రేలియా మాస్టర్స్, ఇంగ్లండ్ మాస్టర్స్, సౌతాఫ్రికా మాస్టర్స్ జట్లు ఈ టోర్నీ బరిలో నిలిచాయి. ఇండియా మాస్టర్స్‌కు సచిన్ టెండూల్కర్ సారథ్యం వహిస్తుండగా.. శ్రీలంకకు కుమార సంగక్కర, వెస్టిండీస్‌కు బ్రియాన్ లారా, ఆస్ట్రేలియాకు షేన్ వాట్సన్, ఇంగ్లండ్‌కు ఇయాన్ మోర్గాన్, సౌతాఫ్రికాకు జాక్వెస్ కల్లిస్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్నారు.

భారత జట్టులో సచిన్ టెండూల్కర్‌తో పాటు అలనాటి స్టార్స్ యువరాజ్ సింగ్, సురేష్ రైనా, అంబటి రాయుడు, యుసఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, స్టువర్ట్ బిన్నీ, ధావల్ కులకర్ణి, వినయ్ కుమార్, షెహబాజ్ నదీమ్, రాహుల్ శర్మ, నమన్ ఓజా, పవన్ నేగీ, గుర్‌క్రిత్ సింగ్, అభిమన్యు మిథున్‌లు ఉన్నారు.

ఇండియా మాస్టర్స్

సచిన్ టెండూల్కర్ (సి), యువరాజ్ సింగ్, సురేష్ రైనా, అంబటి రాయుడు, యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, స్టువర్ట్ బిన్నీ, ధవల్ కులకర్ణి, వినయ్ కుమార్, షాబాజ్ నదీమ్, రాహుల్ శర్మ, నమన్ ఓజా, పవన్ నేగి, గురుకీరత్ సింగ్ మాన్, అభిమన్యు మిథున్.

బ్లో అప్



ప్రీతి ముకుందన్

# సూర్యకు జోడీగా..?



'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీఇచ్చి డ్యాన్స్‌లతో ఆకట్టుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తర్వాత వరస ఆఫర్లు అందుకుంటూ వచ్చిన బోర్సే.. తాజాగా తమిళ హీరో సూర్య సరసన చాన్స్ దక్కించుకున్నట్లు కోలీవుడ్ కోడై కూస్తోంది. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా కథనాలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా భాగ్యశ్రీని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిపారని ఈ ప్రాజెక్టు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఈ ఏడాది మే నెలలో దీని షూటింగ్ ప్రారంభించనున్నారట. సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై సినిమా రానుందని జీవీ ప్రకాశ్ దీనికి సంగీతం అందించనున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే రానున్నరోజుల్లో భాగ్యశ్రీ బిజీ హీరోయిన్‌గా మారడం ఖాయమంటున్నారు అభిమానులు.

ఇప్పటికే భాగ్యశ్రీ చేతిలో వరస సినిమాలు ఉన్నాయి. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కాంత'. ఇందులో దుల్కర్ సరసన భాగ్యశ్రీ కనిపించనున్నారు. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మాతలు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. మహేశ్ దర్శకత్వంలో యంగ్ హీరో రామ్ పోతినేని నటిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీ నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. వీటితోపాటు విజయ్ దేవరకొండ- గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రానున్న 'కింగ్‌డమ్'లో ఈమెను ఎంపిక చేసినట్లు సమాచారం.

# 'మదరాసీ'గా శివకార్తికేయన్

'అమరన్'తో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు హీరో శివకార్తికేయన్. ఆ ఊపుతో మురుగదాస్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. నేడు శివకార్తికేయన్ బర్త్‌డే సందర్భంగా సినిమా టైటిల్‌ను ప్రకటించారు. 'మదరాసి'గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు తెలుపుతూ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.



## ఆ మాటల్లో నిజం లేదు

అక్షయ్‌కుమార్, వీర్ పహారియా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమా కలెక్షన్స్‌పై వస్తోన్న ఆరోపణలపై దర్శకుడు సందీప్ కేవ్లానీ స్పందించారు. ఆ వార్తల్లో నిజం లేదన్నారు. "కలెక్షన్స్ విషయంలో మేము తప్పుడు సమాచారం ఇస్తున్నామని, ఫేక్ పోస్టర్లు వేస్తున్నామని అంటున్నారు. అందులో నిజం లేదు. అయినా, అలాంటి వార్తలు సృష్టిస్తే వారికి వచ్చే లాభాలేమిటో నాకు అర్థం కావడం లేదు. బ్లాక్ బుకింగ్స్ చేశామని, అందుకే ఇన్ని వసూళ్లు వచ్చాయని ఎలా అంటారు? మేము అలాంటి పనులకు పాల్పడలేదు. అవి నిజమైన వసూళ్లు. ప్రేక్షకుల ప్రేమకు అది నిదర్శనం. మా సినిమా విడుదలై 20 రోజులు అవుతున్నా సోషల్‌మీడియాలో ప్రేక్షకులు వరస సందేశాలు పెడుతున్నారు. మా చిత్రాన్ని వారెంతగా ఆదరిస్తున్నారో చెప్పడానికి అదే నిదర్శనం. నిజం చెప్పాలంటే, సినిమా విడుదలైన కొన్ని రోజులపాటే కలెక్షన్స్ గురించి మాట్లాడతారు. ఆ తర్వాత వారికి గుర్తుండేది సినిమా కథ మాత్రమే" అని అన్నారు.

1965లో జరిగిన భారత్ -పాకిస్తాన్ వైమానిక యుద్ధం నేపథ్యంలో రూపొందిన చిత్రమే 'స్కై ఫోర్స్'. రిపబ్లిక్ డే స్పెషల్‌గా జనవరి 24న విడుదలైంది. అక్షయ్‌కుమార్ నటనను సినీప్రియులు మెచ్చుకున్నారు. వీర్ పహారియా, సారా అలీఖాన్ జోడీ కన్నీళ్లుపెట్టించారని అన్నారు. సుమారు రూ.100 కోట్లకు పైగా ఇది వసూలు చేసినట్టు అంచనా.

# సందీప్ కిషనా.. మజాకా

సందీప్ కిషన్ హీరోగా త్రినాథరావు నక్కిన తెర కెక్కిస్తున్న చిత్రం 'మజాకా'. రీతూ వర్మ హీరోయిన్. 'మన్మథుడు' ఫేమ్ అన్షు, రావు రమేశ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 26న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం ప్రమోషన్స్ స్పీడ్ పెంచింది. ఇందులో భాగంగా టీమ్ సరికొత్త ట్రెండుకు శ్రీకారం చుట్టింది. 'రాములమ్మ' పాట చిత్రీకరణను లైవ్ ద్వారా ప్రేక్షకులకు చూపించింది. పాట మేకింగ్ టైమ్‌లో నటీనటులు ఏవిధంగా వర్క్ చేస్తారు? అనే అనుభూతిని ఈ వీడియోతో సినీప్రియులకు అందించింది.



# ఆలియా.. ది గ్రేట్!



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ మరోసారి ఘనతను సాధించారు. ఇన్‌స్టాలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన నటీమణుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫాం హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా రెండోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. జెన్నిఫర్ లోపెజ్‌వంటి అంతర్జాతీయ దిగ్గజాలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం విశేషం. దీంతో అలియా సినీరంగంలో తనస్థానాన్ని పదిలం చేసుకున్నారంటూ అభిమానులు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియాలో ఈ స్టార్ హీరోయిన్‌కు ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ఇన్‌స్టాలో ఈ బ్యూటీని ఏకంగా 8 కోట్లమందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా విశేషాలతోపాటు వ్యక్తిగత విషయాలను కూడా అలియా అభిమానులతో పంచుకుంటుంటారు. ఫొటోషూట్లతో నిత్యం ఆకట్టుకుంటుంటారు. ఇక అలియా గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' జాబితాలో చోటు దక్కించుకోవడం తెలిసిందే.

సినిమాల విషయానికొస్తే.. చివరిసారి 'జిగ్రా'తో అలియా పలకరించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. కొన్ని రోజులుగా ఈమెకు సంబంధించిన పలు వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్- హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న సినిమాలో అలియా యువరాణి పాత్రలో మెరవనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అలాగే టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# అదే అత్యంత బాధపడిన సమయం..

'కొత్తబంగారు లోకం' సినిమాతో కుర్రకారును మైమరపించేసి ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి శ్వేతాబసు ప్రసాద్. కొన్నేళ్లుగా ఆమె టాలీవుడ్‌కు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. ఓ తెలుగు సినిమా సెట్లో తాను అవమానాలు ఎదుర్కొన్నానన్నారు. సెట్లో ఉన్న ప్రతిఒక్కరూ శరీరాకృతి విషయంలో తనని ఎగతాళి చేశారని, ఎంతో బాధపడ్డానని చెప్పారు.

"కెరీర్ విషయంలో నేను సంతృప్తిగానే ఉన్నా. నాకు నచ్చిన సినిమాలు చేశాను. ప్రస్తుతం టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కెరీర్‌పరంగా ఇబ్బంది పడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఒక తెలుగు సినిమా సెట్‌లో చాలా ఇబ్బందిపడ్డా. హీరోతో పోలిస్తే నేను ఎత్తు తక్కువగా ఉన్నానని సెట్లో ప్రతిఒక్కరూ ఎగతాళిచేసేవారు. హీరో ఆరడుగులు ఉంటే ఈవిడేమో 5 అడుగులు ఉందనేవారు. ఇక, హీరోతో సమస్య మరోస్థాయిలో ఉండేది. అతను ప్రతి సన్నివేశాన్ని మార్చేస్తుండేవాడు. రీటేక్స్ తీసుకునేవాడు. తెలుగులో డైలాగ్స్ చెప్పలేకపోయేవాడు. తెలుగులో అంతంతమాత్రమే అయినాఎలాగో నేను



నెట్టుకొచ్చాను. అతను తెలుగు వ్యక్తే అయినా.. భాషపై కంట్రోల్ లేదు కానీ, కాని నా కంట్రోల్లో లేని నా ఎత్తు గురించి కామెంట్ చేసేవాడు. ఎత్తు అనేది వారసత్వంగా వస్తుంది, దానికి మనమేం చేయగలం' అంటూ చెప్పుకొచ్చింది శ్వేత. 11 ఏళ్లకే బాలనటిగా కెరీర్ ఆరంభించి.. 2008లో తెరకెక్కిన 'కొత్తబంగారు లోకం'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిందామె. ఆ సినిమా విజయం తర్వాత 'రైడ్', 'కాస్కో', 'కళావర్ కింగ్', 'ప్రియుడు', 'జీనియస్'వంటి చిత్రాల్లో నటించారు. 2018లో విడుదలైన 'విజేత' తర్వాత ఆమె తెలుగు సినిమాల్లో నటించిన సందర్భం లేదు.

# తారక్ లేకుండానే..



ప్రశాంత్ నీల్ -ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమాపై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమా వచ్చేవారం నుంచి రెగ్యులర్ చిత్రీకరణ స్టార్ట్‌కాబోతున్నట్లు తెలుస్తోంది. అయితే, తొలి షెడ్యూల్‌లో తారక్ లేని సన్నివేశాల్ని చిత్రీకరించనున్నారని.. మార్చినుంచి ఎన్టీఆర్ సెట్స్‌లోకి అడుగు పెడతారని వినిపిస్తోంది.ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓల్డ్ కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో ప్రత్యేక సెట్‌ను రెడీ చేస్తున్నారు. ఈ సెట్‌లోనే సినిమా రెండో షెడ్యూల్ చేస్తారట.

ఈ పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ కనిపించబోతుంది. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో నటించనున్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఆ మధ్య ఈ సినిమా గురించి ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ ఊహించని స్థాయిలో మూవీని తీస్తున్నాను. ఎన్టీఆర్‌పై అభిమానంతో సినిమా చేస్తున్నాను' అన్నారు. చూడాలి.. ఆడియన్స్‌కు అంతచిక్కని అంశాలేముంటాయో!